

చిన్నారులను హింసించిన
నిందితుడి అరెస్ట్
- హత్యాయత్నం కేసు నమోదు
- జంగారెడ్డిగూడెం ఘటనలో తల్లిపైనా కేసు నమోదు చేసిన పోలీసులు

7



నూజివీడు కౌన్సిల్‌లో మూజువాణీ ఓటు వేసేందుకు టీడీపీ కౌన్సిలర్లతోపాటు చేతులు ఎత్తిన మంత్రి కొలుసు పార్థసారథి (పైన), కౌన్సిల్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన పగడాల సత్యనారాయణకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ప్రిసైడింగ్ అధికారి, సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, కమిషనర్ వెంకటరామిరెడ్డి(కింద)

దేశం జెండా రెపరెపలు



ఏలూరు కార్పొరేషన్‌లో డిప్యూటీ మేయర్ల ఎన్నికను నిర్వహిస్తున్న ప్రిసైడింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి(పైన), డిప్యూటీ మేయర్లుగా ఎంపికైన ఉమామహేశ్వరరావు, దుర్గాభవానీలను అభినందిస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ నూర్జహాన్, కో ఆప్షన్ సభ్యుడు పెదబాబు తదితరులు

నూజివీడు మున్సిపల్ వైస్ చైర్మన్‌గా పగడాల

నూజివీడు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): నూజివీడు మునిసిపాలిటీలో వైసీపీ కౌన్సిలర్లు పది మంది పసుపు కండువా కప్పుకోవడంతో వైస్ చైర్మన్ పదవి టీడీపీ వశమైంది. మున్సిపల్ సమావేశ మందిరంలో సోమవారం వైస్ చైర్మన్ ఎన్నిక జరిగింది. 32 మందికి కౌన్సిల్ సభ్యులకు తవిడిశెట్టి వెంకటలక్ష్మి మినహా 31 మంది హాజరయ్యారు. ఎక్స్ అఫీషియో సభ్యునిగా రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. తొలుత వైసీపీ కౌన్సిలర్ నవుడు నాగమల్లేశ్వరరావును ఆ పార్టీ కౌన్సిలర్లు శీలం రామయ్యరావు ప్రతిపాదించగా, షేక్ అమీరున్నీసా బేగం బలపర్చారు. మూజువాణి ఓటు విధానంలో నాగమల్లేశ్వరరావును 14 మంది కౌన్సిలర్లు బలపరుస్తూ చేతులెత్తారు. అయితే 13 మందే సంతకాలు చేశారు. 11వ వార్డు కౌన్సిలర్ గాదిరెడ్డి శ్రీలతారెడ్డి సంతకం చేయకపోవడం గమనార్హం.

అనంతరం తాజా మాజీ వైస్ చైర్మన్, ఐదో వార్డు వైసీపీ కౌన్సిలర్ పగడాల సత్యనారాయణ పసుపు కండువా కప్పుకుని టీడీపీ తరఫున వైస్ చైర్మన్‌గా పోటీ చేశారు. ఆయనను కౌన్సిలర్లు మల్లిశెట్టి ప్రియదర్శిని ప్రతిపాదించగా, కందుల సత్యనారాయణ బలపరిచారు. పగడాలను మంత్రి పార్థసారథితో కలిసి 18 మంది సమర్థిస్తూ సంతకాలు చేశారు. వైస్ చైర్మన్‌గా పగడాల ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి, నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ ప్రకటించి, ఎన్నిక పత్రాన్ని అందించారు.

చైర్‌పర్సన్‌పై టీడీపీ గురి !

మునిసిపాలిటీలో ప్రస్తుత పరిణామాలను చూస్తే నెల రోజుల్లో మరో ఎన్నిక తప్పనిసరి పరిస్థితి కనిపిస్తోంది. తాజాగా వైస్ చైర్మన్ పదవిని తన ఖాతాలో వేసుకుని, బలం పెంచుకున్న టీడీపీ తదుపరి చైర్మన్ గిరిపై దృష్టి పెట్టినట్లు స్పష్టమవుతోంది. మున్సిపాల్టీలోని మొత్తం 32 వార్డులకు 17 వార్డుల సభ్యులు తాజాగా తెలుగుదేశం సభ్యులుగా ఉన్నారు. మరో రెండు, మూడు రోజుల్లో మరికొందరు చేరే అవకాశం కనిపిస్తోంది. ఈ క్రమంలో వచ్చే మున్సిపల్ సమావేశాల్లో చైర్మన్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టి ఆ పదవిని తన ఖాతాలో వేసుకునే దిశగా మంత్రి పార్థసారథి పావులు కదుపుతున్నారు.

పసుపు కండువాలతో కౌన్సిల్ హాల్లోకి

32 వార్డులకు టీడీపీకి ఏడుగురు కౌన్సిలర్ల బలం మాత్రమే ఉంది. ఎన్నికల సమయంలోనే 3వ వార్డు కౌన్సిలర్ షేక్ మీరాబాయ్ టీడీపీ తీర్థం పుచ్చుకోగా, తాజాగా పగడాల నేతృత్వంలో కౌన్సిలర్లు దాసరి వెంకటమారుఅప్పాజీ(2), బాణావతు రంగారావు(9), హరికోటి రమాదేవి (15), కొప్పుల ప్రదీప్‌కుమార్(19), గాజుల సీతాకుమారి(27), జూట్రు మేరీరాణి(29), నడకుదురు గిరీష్‌కుమార్(30), మేకల రమాదేవి(31) పసుపు కండువాలు కప్పుకున్నారు. మొత్తం పది మంది వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరినట్లు అయింది. మంత్రి పార్థసా రథితో తమ పార్టీ కౌన్సిలర్లతోపాటు పది మంది పసుపు కండువాలతో కౌన్సిల్ హాల్లోకి ప్రవేశించారు. వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలోకి రావడంతో కౌన్సిల్లో ఈ పార్టీ బలం పెరిగింది.

- టీడీపీలోకి పది మంది వైసీపీ కౌన్సిలర్లు
- ఎక్స్‌అఫీషియో ఓటు వేసిన మంత్రి పార్థసారథి
- టీడీపీకి 18.. వైసీపీకి 14 ఓట్లు..



- రెండు పదవులు ఏకగ్రీవంగా టీడీపీకే
- వైసీపీ కార్పొరేటర్లు గైర్హాజరు
- 32కు పెరిగిన కూటమి బలం

ఏలూరు డిప్యూటీ మేయర్లుగా పప్పు ఉమామహేశ్వరరావు వందనాల దుర్గాభవాని

ఏలూరు టూ టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఏలూరు నగర పాలక సంస్థలో రెండు డిప్యూటీ మేయర్ పదవులు టీడీపీ కైవసం చేసుకుంది. 30వ డివిజన్ కార్పొరేటర్ పప్పు ఉమా మహేశ్వరరావు, 47వ డివిజన్ కార్పొరేటర్ వందనాల దుర్గాభవాని శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రిసైడింగ్ అధికారి, జేసీ ధాత్రిరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. ఉమామహేశ్వరరావును కార్పొరేటర్లు భీమవరపు హేమ సుందరి ప్రతిపాదించగా కర్రి శ్రీనివాసరావు బలపరిచారు. దుర్గాభవాని పృథ్వీ శారద ప్రతిపాదించగా తంగిరాల అరుణాసురేష్ బలపరిచారు. పాలక మండలిలో 50 మంది కార్పొరేటర్లకు గాను 32 మంది హాజరై వీరిద్దరికి అనుకూలంగా మద్దతు తెలిపారు. ఖాళీగా ఉన్న రెండు డిప్యూటీ మేయర్ల స్థానాలకు రెండే నామినేషన్లు రావడంతో ప్రిసైడింగ్ అధికారి వీరిద్దరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) మాట్లాడుతూ డిప్యూటీ మేయర్లు పార్టీలకతీతంగా నగరాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడమే కాకుండా వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ నగరాభివృద్ధికి డిప్యూటీ మేయర్లతో కలిసి ఐక్యంగా కృషి చేస్తామన్నారు. పప్పు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కష్టపడి పనిచేసి ప్రజల మనస్సు గెలుస్తామన్నారు. వైసీపీ హయాంలో కౌన్సిల్‌లో ఎన్నో అవకతవకలు జరిగాయన్నారు. అలాంటి అవకతవకలకు చోటు లేకుండా అవినీతిరహితంగా పాలన కొనసాగించడానికి మేయర్‌తో కలిసి పనిచేస్తామన్నారు. డిప్యూటీ మేయర్‌గా అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ కృతజ్ఞతలు తెలిపారు. వందనాల దుర్గాభవాని మాట్లాడుతూ తనకు డిప్యూటీ మేయర్‌గా అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య డిప్యూటీ మేయర్ల ఎంపిక ప్రశాంతంగా జరిగింది. వైసీపీ నాయకులు కాని, కార్పొరేటర్లు కాని రాకపోవడంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదు. పాలక మండలి విప్‌గా తంగిరాల అరుణాసురేష్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కమిషనర్ ఏ.భానుప్రతాప్, అడిషనల్, డిప్యూటీ కమిషనర్లు జీ.చంద్రయ్య, శివారెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు.

టీడీపీకే మెజారిటీ స్థానాలు

2021 జూలైలో జరిగిన నగరపాలక సంస్థ ఎన్నికల్లో 50 స్థానాలకు వైసీపీ 47, టీడీపీ మూడు స్థానాలు గెలుచుకుంది. గతేడాది ఎన్నికల ముందు వైసీపీ నుంచి ముగ్గురు కార్పొరేటర్లు టీడీపీలోకి వచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మేయర్ సహా మరో 21 మంది, సోమవారం మరో ఐదుగురు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. దీంతో కూటమి బలం 32కు చేరింది. మిగిలిన 18 మంది గైర్హాజరయ్యారు.





సామూహిక సరస్వతి పూజలు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : వసంత పంచమి సందర్భంగా సోమవారం సరస్వతిదేవి అమ్మవారి నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయడంతో పాటు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఆంధ్రా బాసరగా పేరుగాంచిన నూజివీడు సరస్వతిదేవి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలకు వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సుమారు వెయ్యికి పైగా చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కాగా వసంత పంచమిని పురస్కరించుకుని భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు.

నిమ్మధర పతనం

- బస్తా రూ.5వేల నుంచి రూ.1500లకు పడిపోయిన వైనం
- ఖర్చులు కూడా రావంటూ రైతులు లబోదిబో

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : నిమ్మకాయల ఉత్పత్తి లేనప్పుడు మంచి ధర ఉంది. మార్కెట్‌కు ఉత్పత్తులు రాగానే ధర అమాంతం పడిపోయింది. రెండు నెలల క్రితం నిమ్మకాయల బస్తా (50 కేజీలు) రూ.5 వేల నుంచి రూ.6 వేలు ధర పలికింది. నెల రోజులుగా ధర క్రమేపీ తగ్గుతోంది. ప్రస్తుతం దిగుబడి రావడంతో ఒకేసారి ధర రూ.1500 వద్దకు పడిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్నాటక, ముంబై తదితర రాష్ట్రాలకు వ్యాపారులు ఇక్కడి నుంచే ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం దిగుబడి ఎక్కువ రావడంతో మార్కెట్ యార్డుకు రోజుకు 30 నుంచి 40 లారీల బస్తాలు వస్తున్నాయి. జంగారెడ్డిగూడెం, ద్వారకాతిరుమల, గోపన్నపాలెం, పెద వేగి పరిసర ప్రాంతాల్లో రైతులు నిమ్మ సాగు చేస్తున్నారు. నెల రోజుల నుంచి నిమ్మ ధరలు క్రమేపి తగ్గుముఖం పట్టాయి.



శీతాకాలం చలి తీవ్రం కావడంతో ఉత్తరాదిన నిమ్మకు డిమాండ్ తగ్గడంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. దిగుబడి ఎక్కువగా రావడం మరో కారణంగా చెబుతున్నారు. గ్రేడ్-1 నిమ్మకాయల బస్తా రెండు నెలల క్రితం రూ.5 వేలకు పైగా ధర పలుకగా, ప్రస్తుతం బస్తా రూ.1500 ధర ఉంది. రెండో రకం కాయలు రూ.వెయ్యి నుంచి రూ.800 వరకు ధరలు పలుకుతున్నాయి. ధర పతనం కావడం, ఖర్చులు పెరగడంతో అప్పుల్లో మునుగుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంచి ధర రూ.30, ఆటో బాడుగ బస్తాకు రూ.400 ఖర్చవుతుంటే మార్కెట్‌లో రూ.1500 ధర పలకడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కనీసం కూలీ ఖర్చులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోనెల ఇలాగే ఉంటుందని వ్యాపారులు చెబుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వేసవిలో నిమ్మకాయల ధరలు పెరుగుతాయి. ఏప్రిల్, మేలో నిమ్మకాయలు కేజీ గతేడాది రూ.180 వరకు ధర పలికింది. బయట మార్కెట్‌లో డజను రూ.100 చొప్పున అమ్మకాలు చేశారు. ప్రస్తుతం రైతులకు పెట్టుబడి రావడం లేదని నిమ్మ రైతులు చెబుతున్నారు.

ఖర్చులు వచ్చేలా లేవు..



నిమ్మ దిగుబడి ఆశాజనకంగా ఉన్నా ధర రాక పోవడంతో నష్టం తప్పడం లేదు. గిట్టుబాటు కాకున్నా కాయలు మాత్రం మార్కెట్‌కు తరలించక తప్పదు. కనీసం కూలీ ఖర్చులు వచ్చేలా లేవు.

- రాము నిమ్మరైతు, పంగిడిగూడెం

కొల్లేరులో సంప్రదాయ వేటకు భంగం కలగదు

- ఆక్రమణలు చేస్తే సహించం.. పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి



కైకలూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కొల్లేరు అభయారణ్య పరిధిలో భూ ఆక్రమణలు తొలగించాలని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసిందని, అయితే కొల్లేరు లో సంప్రదాయవేట చేసుకునే హక్కు ఎప్పుడూ ఉంటుందని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఫారెస్ట్ అధికారి (పీసీసీఎఫ్) చిరంజీవి చౌదరి అన్నారు. ఆటపాక పక్షుల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొల్లేరు ఆపరేషన్ సమయంలో 15 వేల ఎకరాల జిరాయితీ భూ ములను ధ్వంసం చేశారని, వాటికి నష్టపరిహారం అందించలేదని ప్రజలు వెలుగులోకి తీసుకొచ్చార న్నారు. ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉన్నందున దీనిపై తాను ఏమీ చెప్పలేనన్నారు. వేట ముసుగులో చేపల చెరువులు, రసాయన మందులు వినియోగించడం చట్టరీత్యా నేరమన్నారు. సంప్ర దాయ వేట కొనసాగించుకోవాలే తప్ప ఆక్రమణలతో పర్యావర ణాన్ని కలుషితం చేస్తే ధ్వంసం చేస్తామన్నారు. దీనిపై కోర్టు ఆదేశాల మేరకు నడవాల్సి ఉంటుందన్నారు.

భార్య మోసగించడంతో..
భర్త ఆత్మహత్య

7

అంతా గప్‌చుప్ !

- డిప్యుటేషన్ల రద్దుపై పీహెచ్‌సీలకు ఆదేశాలతో సరి
- డీఎంహెచ్‌వో కార్యాలయ పరిధిలోనే పదుల సంఖ్యలో..



ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పని సర్దుబాటు/తాత్కాలిక ఏర్పాట్లు కింద డిప్యుటేషన్లపై నియమించిన వారందరినీ తక్షణమే వెనక్కి పంపించడంతో పాటు, రాష్ట్ర కార్యాలయ ఉన్నతాధికారుల అనుమతి లేనిదే కొత్తగా డిప్యుటేషన్లు ఇవ్వవద్దని వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య ఉన్నతాధికారి ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులు నీరుగారేలా జిల్లా అధికారుల చర్యలు ఉన్నాయి. గత నెల 28న వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు డిప్యుటేషన్లపై ఉత్తర్వులు జారీ చేయగా, దానికనుగుణంగా వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ కె.పద్మావతి జనవరి 31న శాఖాపరంగా ఉత్తర్వులు ప్రాంతీయ సంచాలకులకు, డీఎంహెచ్‌వోలకు పంపారు. ఆ ప్రకారం ఇప్పటికే వున్న డిప్యుటేషన్లన్నింటినీ రద్దు చేసి, ఆయా పోస్టుల్లో పని సర్దుబాటు కింద పని చేస్తున్న వారందరినీ వారి మాతృస్థానాలకు పంపాలని ఆదేశించారు. ఎక్కడైనా పరిపాలనా పరమైన అవసరాలుంటే వాటి ఆవశ్యకతను తెలుపుతూ లిఖితపూర్వక ప్రతిపాదనలను పంపి ఆమోదం తీసుకోవాలని స్పష్టం చేశారు. తమ ఆదేశాల అమల్లో ఎక్కడైనా ఉల్లంఘనలు, నిర్లక్ష్యం వహిస్తే వారిని డిఫాల్టర్లుగా పరిగణించి శాఖాపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. అయితే జిల్లాలో ఈ ఆదేశాలు దాదాపు బుట్టదాఖలయ్యాయనే ఆరోపణలు వస్తున్నాయి. సాక్షాత్తూ డీఎంహెచ్‌వో కార్యాయంలోనే ఏళ్ల తరబడి ఆయా సీట్లలో డిప్యుటేషన్ల ఉత్తర్వులతో అతుక్కుపోయినవారు ఉన్నప్పటికీ జిల్లా అధికారుల దృష్టికి రాకపోవడం గమనార్హం. గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా సిఫారసులు, ప్రజాప్రతినిధుల ఆశీస్సులతో జిల్లా అంతటా పదుల సంఖ్యలోనే ఆయా కేడర్లలో వైద్య ఉద్యోగులు డిప్యుటేషన్లపై తిష్ట వేశారు. అసలు డీఎంహెచ్‌వో కార్యాలయంలో కీలకపోస్టులన్నీ డిప్యుటేషన్లపై ఉండగా క్షేత్ర స్థాయి లో రాష్ట్ర ఉన్నతాధికారుల ఉత్తర్వులు ఎలా అమలవుతాయనే సందేహాలు వ్యక్తమవు తున్నాయి.

దిగువకు పంపడంతో సరి..

వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి పంపిన సర్క్యులర్‌కు అనుగుణంగా డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచే తొలుత ప్రక్షాళన ప్రారంభం కావాల్సి ఉంది. ఈ విషయాన్ని పట్టించుకోకుండా జిల్లాలోని పీహెచ్‌సీల పరిధిలో ఎక్కడా డిప్యుటేషన్లు ఉండరాదని, ఉంటే వివరాలను తమకు పంపాలని డీఎంహెచ్‌వో కార్యాలయం ఈనెల 1న వైద్యాధికారులకు ఆదేశాలు జారీ చేసి చేతులు దులుపుకుందని చెప్పవచ్చు. వాస్తవానికి పీహెచ్‌సీల్లో వైద్య సిబ్బంది డిప్యుటేషన్లు వేయాలన్నా డీఎంహెచ్‌వో అనుమతి తప్పనిసరి. ఆ ప్రకారం జిల్లావ్యాప్తంగా ఎక్కడెక్కడ డిప్యుటేషన్లలో ఎవరెవరు ఉన్నదీ డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారులకు ఇట్టే తెలిసిపోతుంది. డీఎంహెచ్‌వో కార్యాలయంతో పాటు, జిల్లా అంతటా దాదాపు 50కి పైగా ఆయా కేడర్లలో డిప్యుటేషన్లు ఉన్న విషయం జిల్లా అధికారులకు తెలినా కేవలం మొక్కుబడి ఉత్తర్వులను జారీ చేయడాన్ని గమనిస్తే ఎక్కడి వారక్కడే గప్‌చుప్ అన్నట్టుగా ఉందని ప్రచారం జరుగుతోంది. దీర్ఘకాలంగా ఏపీ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో పనిచేసి కొన్నినెలల క్రితమే పదోన్నతిపై డీఎంహెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన అధికారిణికి ఇంతవరకు తనశాఖ కార్యకలాపాలపై అంతగా పట్టులేకపోవడంతో డిప్యుటేషన్లపైనే పనిచేస్తున్న కొందరు కార్యాలయ అధికారులు, కీలక విభాగాల ఉద్యోగులు తప్పుదారి పట్టిస్తున్నారని సమాచారం. జిల్లాలో డిప్యుటేషన్ల గురించి డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని వివరణ కోసం సోమవారం సాయంత్రం ఫోన్‌లో ప్రయత్నించగా ఆమె స్పందించలేదు.

నాడు నేడు

నరక దారులకు మోక్షం

రోడ్లకు మంచిరోజులు వచ్చాయి.. ఐదేళ్లుగా ఆలనా పాలనా లేక అధ్వాన స్థితికి చేరిన రహదారులకు మోక్షం కలిగింది.. నరక దారుల నుంచి బయట పడ్డామని జనం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రోడ్లపై అడుగు పెట్టాలంటే నరకంగా ఉండేది. ఎక్కడా రహదారుల బాగోగులు పట్టించుకున్న పాపాన పోలేదు.. జనం నానా అవస్థలు పడ్డారు.. గోతుల రోడ్లలో పడి ఆసుపత్రిపాలైనవారు ఎందరో.. కొంతమంది మృత్యువాత కూడా పడ్డారు.. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రహదారులపై దృష్టి పెట్టింది. ఏడు నెలల్లోనే రహదారులు సుందరంగా రూపుదిద్దుకున్నాయి. నాటి రోడ్ల పరిస్థితి.. రోడ్లు వేశాక పరిస్థితిపై దృశ్య మాలికి 'నాడు-నేడు'





ఇది కాళ్ల నుంచి కోలనపల్లి గ్రామానికి వెళ్లే దారి... గత ప్రభుత్వంలో రోడ్డంతా పెద్ద పెద్ద గోతులు పడి చెరువును తలపించేది.. కూటమి ప్రభుత్వం సుమారు రూ.40 లక్షలతో ఈ రహదారి నిర్మాణ పనులను చేపట్టింది. తమ కష్టాలు తీరాయని వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. - కాళ్ల (ఆంధ్రజ్యోతి)





గతంలో ఇరగవరం మండలంలోని కె.ఇల్లిందలపర్రు గ్రామంలోని రోడ్డు దుస్థితి ఇది.. కూటమి ప్రభుత్వం 1.50 లక్షల నిధులతో రహదారి నిర్మాణం పూర్తి చేసింది. దీంతో తూర్పు విప్పర్రు, కె. ఇల్లిందలపర్రు, సూరంపూడి, కె.కుముదవల్లి గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. - ఇరగవరం (ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఏలూరు నగరంలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. వర్షాకాలంలో గోతులన్నీ నీటితో నిండిపోయి ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడేవారు. కూటమి ప్రభుత్వం బిర్లా భవన్ నుంచి గడియారపు స్తంభం వరకు రూ.65 లక్షలతో ఇటీవల నూతన రోడ్డు నాణ్యతా ప్రమాణాలతో నిర్మించింది..
- ఏలూరు టూటౌన్ (ఆంధ్రజ్యోతి)





మేడపాడు, నేరేడుమిల్లి, రావిపాడు, రావిగొప్పు గ్రామాల మధ్య ప్రధాన రహదారి చాలాచోట్ల కంకర రాళ్లు పైకిలేచి అధ్వాన స్థితికి చేరింది. రూ.2.89 కోట్ల నిధులతో బీటీ రోడ్డు నిర్మించారు. ఏళ్లతరబడి అధ్వాన్నంగా ఉన్న ఈ రహదారి..నేడు అద్దంలా మెరిసి పోతోందని వాహనదారులు అంటున్నారు. హాయిగా రాకపోకలు సాగిస్తున్నామని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
- యలమంచిలి (ఆంధ్రజ్యోతి)





హిమ సోయగం





ద్వారకాతిరుమల ఆలయ ఘాట్ రోడ్, జంట గోపురాల వద్ద మంచుపరదా..

ద్వారకాతిరుమల/ తాడేపల్లిగూడెం రూరల్ ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మంచుకురిసే వేళలో శ్రీవారి క్షేత్ర రమణీయత మరింతగా శోభిల్లింది. శేషాచలంపై అలముకున్న మంచు తెరలు సోమవారం చూపరులకు కనువిందు చేశాయి. మరోపక్క రహదారులు సరిగా కనిపించక భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 8-30 గంటలు దాటినా భానుడి దర్శనం కలగలేదు.

మధ్యాహ్నం ఎండ చుర..చుర

తాడేపల్లిగూడెంలో సోమవారం ఉదయం పొగమంచు 9 గంటల వరకూ తెరతీయకుండా ఉక్కిరి బిక్కిరి చేస్తే మధ్యాహ్నం ఎండ చిర్రెత్తించింది. ఉదయం మంచు తీవ్రతకు ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక పోవడంతో లైట్లు వేసుకుని మరీ వాహనాలు నడిపే పరిస్థితి కనిపించింది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉక్కిరిబిక్కిరి చేసింది.



తాడేపల్లిగూడెం టిడ్కో ఇళ్లకు వెళ్లే రోడ్డులో ఉదయం 9 గంటలకు కూడా వీడని మంచు



కడియద్ద వద్ద మధ్యాహ్నం ఎండ తీవ్రత..



మారనున్న రైల్వేస్టేషన్ ముఖద్వారం

గూడెం రైల్వేస్టేషన్‌కు కొత్త రూపు

రూ.24 కోట్లతో అభివృద్ధి పనులు

తాడేపల్లిగూడెం రూరల్ ఫిబ్రవరి 3 (ఆంధ్ర జ్యోతి): అమృత్ స్టేషన్‌లలో ఒకటైన తాడేప ల్లిగూడెం రైల్వేస్టేషన్ రూపు మారనుంది. మూడు ప్లాట్‌ఫాంలతో ఉన్న ఈ స్టేషన్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆరు నెలలుగా జరుగుతున్న ఈ పనులు తాజాగా బడ్జెట్ కేటాయింపుల్లో అమృత్ స్టేషన్‌లకు నిధులు కేటాయించడంపై మరింత ఉత్సాహంగా సాగుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు వ్యాపార కేంద్రంగా ఉన్న తాడేపల్లి గూడేం ఏపీ నిట్, ఉద్యాన విశ్వవిద్యాలయం తదితర విద్యాసంస్థలతో ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయింపుతో ఈ పనులు మరింత వేగంగా సాగి త్వరలోనే కొత్త రైల్వేస్టేషన్ ప్రయాణికులకు స్వాగతం పలకనుంది. స్టేషన్ ముఖద్వారం మొత్తం మారిపోనుంది. ప్లాట్‌ఫాం 1 నుంచి 2, 3 లకు ప్రత్యేక వంతెనతో పాటు ఏసీ మోడ్రన్ టాయిలెట్స్, ప్లాట్‌ఫాంలకు గ్రానైట్ ఏర్పాటు, 3 ప్లాట్‌ఫాంలో షెల్టర్‌ల ఏర్పాటు తదితర పనులు చేపట్టనున్నారు.



నిర్మాణంలో ఉన్న అధునాతన టాయిలెట్స్



ప్లాట్‌ఫాంలను కలుపుతూ నిర్మిస్తున్న బ్రిడ్జ్

సూర్య ఆరాధనతో ఆరోగ్యం

నేడు రథ సప్తమి

భీమవరం టౌన్/ ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 3 (ఆంధ్ర జ్యోతి) : అతి పవిత్రమైన మాసం మాఘ మాసం. ఈ మాసాన్ని మాధవ మాసం అని కూడా అంటారు. సకల దేవతలను పూజించడానికి కావలసిన పర్వదినాలు అన్నిటినీ ఈ మాసంలో మనం పొందవచ్చు. మాఘ శుద్ధ పంచమి (శ్రీ పంచమి) రోజున చదువుల తల్లి సరస్వతిని పూజిస్తే విద్యార్థులకు మంచి విద్యా బుద్ధులు కలుగుతాయి. శ్రీ పంచమి రోజున త్రిశక్తి స్వరూపాల్లో ఒకటైన సర్వసతీ అవతారంగా ఆవిర్భవించిందని దేవీ భాగవతంలో ఉంది. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించిన తర్వాత వచ్చే అతి పవిత్రమైనది ఈ మాఘ మాసమే. ఈ మాసంలో సూర్య భగవానుడిని పూజిస్తే వారికి సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని పండితులు చెబుతున్నారు.

రథసప్తమి రోజున ఏం చేయాలి

మాఘ శుద్ధ సప్తమిని రథసప్తమి అని అంటారు. ఈ రోజున జిల్లేడు ఆకు, రేగుపండ్లు, పుష్పములు తలపై ధరించి ఉదయిస్తున్న సూర్యునికి ఎదురుగా నిలబడి స్నానం ఆచరించాలి.




భీమవరం సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకారంలో సూర్యభగవానుడు

దీనివల్ల ఈ జన్మలోనే కాక జన్మ జన్మలలో పంచేంద్రియాల చేత తెలిసీ తెలియక చేసిన పాపాలన్నీ తొలుగుతాయని నమ్మకం. అదే రోజున మహిళలు ఆవు పిడకల మంటపై ఆవుపాలు, బెల్లం, చెరుకు ముక్కను వేసి సూర్యునికి అభిముఖంగా ప్రసాదం వండుతారు. చిక్కుడు కాయలతో రథం తయారు చేసి చిక్కుడు ఆకుల్లో వండిన ప్రసాదాన్ని ఉంచి సూర్యుకి నైవేద్యంగా పెడతారు. పూజ చేసుకున్న మహిళలు తరిగిన కూరలను తినరు. రాత్రి ఉపవాసం ఉంటారు. ఈరోజు నుంచి సూర్యునికి భూమి దగ్గరవడం వల్ల భూమిపై వేడిని ప్రసరించి అనేక జీవరాశులకు ఉత్తేజాన్ని ఇస్తాడు.

కనిపించే ప్రత్యక్ష దైవం ఆదిత్యుడు..

సూర్యుడిని కనిపించే ప్రత్యక్ష దైవంగా భావిస్తాం. ప్రతీ మాసంలో వచ్చే సప్తమి కన్నా మాఘమాసంలోని శుక్లపక్షంలో వచ్చే సప్తమి రోజున సూర్య దేవునికి పూజలు నిర్వహిస్తారు. ఈ రోజున సూర్యారాధన వల్ల ఏడు జన్మల పాపాలు తొలగిపోతాయని పురాణాలు తెలియజేస్తున్నాయి. మకర సంక్రాంతి వేళ సూర్యుడు తన దిశను మార్చు కుంటాడు. రథసప్తమి అంటే సూర్యుడు జన్మించిన రోజుగా పరిగణిస్తారు. ఈ రోజున పవిత్ర నదీ స్నానానికి ఎంతో విశిష్టత ఉంది తలపై ఏడు జిల్లేడు ఆకులను ఉంచుకుని నీటితో తల స్నానం చేస్తే ఏడు జన్మల పాపాలు తొలగిపోతాయి. సూర్య కిరణాలు ఎక్కడ పడతాయో అక్కడ ముగ్గు వేసి సూర్య భగవానుని ఫొటో ఉంచి ఎర్రని పూలతో అలంకరించాలి. నువ్వులు, బెల్లం కలిపి సూర్య భగవానుడిని పూజించాలి.సూర్య భగవానుని ఆరాధించడం ద్వారా అనేక ఫలితాలు ఉంటాయి

- కిళాంబి మారుతి శ్రీనివాస రామానుజాచార్యులు
ఏలూరు వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రధాన అర్చకులు



శ్రీవారి సేవకు సిద్ధమైన సూర్యప్రభ వాహనం

శ్రీవారి ఆలయంలో నేడు రథసప్తమి వేడుకలు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయంలో రథసప్తమి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. అధిక సంఖ్యలో భక్తులు వస్తారని ఆలయ వర్గాలు భావిస్తున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 7.30 గంటలకు సూర్యప్రభ వాహనంపైనా, రాత్రి 6.30 గంటలకు చంద్రప్రభవాహనంపైన శ్రీవారు, అమ్మవార్లు క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతారు. వాహనశాల నుంచి వాహనాలను తెచ్చి ముస్తాబు చేసి సేవలకు సిద్ధం చేస్తున్నారు.



వీరంపాలెంలో సామూహిక అక్షరాభ్యాసాలు

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం బాలా త్రిపురసుందరి పంచాయతన క్షేత్రంలోని మేధాసరస్వతి అమ్మవారి సన్నిధిలో సామూహిక అక్షరాభ్యాసాలు చేశారు. సుమారు 25 వేలమంది భక్తులు హాజరైనట్లు ఆలయ సిబ్బంది తెలిపారు. ఆలయ వ్యవస్థాపకులు గరిమెళ్ల వెంకట సిద్ధాంతి పర్యవేక్షణలో వేదపండితుల మంత్రోచ్ఛరణలతో ఈ అక్షరాభ్యాసాలు నిర్వహించారు.



మల్లవరంలో రావి, వేప చెట్లకు కల్యాణం

నరసాపురం రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మల్లవరంలో సోమవారం రావి, వేప చెట్లకు కల్యాణం నిర్వహించారు. కొటికలపూడి విజయ సుబ్బారావు, రామకృష్ణ, చంద్రశేఖర్, లక్ష్మీ వెంకటేశ్వరావు, నిమ్మల పృథ్వీ నాగేంద్ర దంపతులు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. 75 ఏళ్ళ క్రితం మల్లు కృష్ణ సెంటర్‌లో రావి చెట్టును పాతారు.అది మహావృక్షంగా మారి గ్రామస్థులకు రచ్చబండగా మారింది. అయితే గతేడాది గాలి వానలకు ఈ వృక్షం నేలకొరిగింది. దీంతో మల్లు కృష్ణ వారసులైన కొటికలపూడి కుటుంబ సభ్యులు రావి చెట్టుతో పాటు వేప చెట్టు నాటి కల్యాణం చేశారు.అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.



పూజల్లో పాల్గొన్న ఆలయ ధర్మకర్త వేదుల వెంకటేష్ తదితరులు



8 నుంచి లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాలు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సుందరగిరిపై కొలువైన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఈనెల 8 నుంచి 13 వరకూ జరుగనున్న కల్యాణ మహోత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన మండలంలోని ఐఎస్ జగన్నాధపురంలో ఆలయ ప్రాంగణం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.ప్రత్యేక క్యూలైన్లు, చలువ పందిళ్ల నిర్మాణపనులు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 8న ఉదయం 10 గంటలకు స్వామివారిని, కనకవల్లీ, లక్ష్మీ అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లి కుమార్తెలుగా చేస్తారు. 10న ఉదయం 11-10 గంటలకు స్వామివారి కల్యాణం, 11న గ్రామోత్సవం, 12న పంచామృతాభిషేకాలు, చందనోత్సవం, ధ్వజ అవరోహణ, 13న సాయంత్రం జరుగనున్న ద్వాదశ ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయి.

వల్లూరుపల్లిలో ముగిసిన ప్రతిష్ఠా మహోత్సవాలు

పెంటపాడు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వల్లూరుపల్లి మందేశ్వర స్వామి నూతన ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు బాదంపూడి ఫణిశర్మ బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీలు స్వామివారిని దర్శించుకున్నారు.అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.



పూర్తయిన కళా వేదిక.. అచ్చమ్మ పేరంటాలమ్మ

నేటి నుంచి అచ్చమ్మ పేరంటాలమ్మ వార్షికోత్సవాలు

దెందులూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : దెందులూరు మండలం గాలాయగూడెం గ్రామ దేవత అచ్చమ్మ పేరంటాలమ్మ 68వ వార్షికోత్సవాలను మంగళవారం దెందులూరు శాసన సభ్యులు చింతమనేని ప్రభాకర్ ప్రారంభించనున్నారు. 4వ తేదీ నుంచి అమ్మవార్లను విశేష అలంకరణలు చేయనున్నారు. పసుపు కుంకుమతో అలంకరణ, 5న నిమ్మకాయలతో, 7న గాజులతో, 8న గంధంతో 9న నెమలి పించాలతో, 10న రకరకాల పూలతో అలంకరించనున్నారు. 11వ తేదీన పూజారి ఆడ పడుచు పట్టు చీరతో అలంకరణ, 12న కూరగాయాలతో అలంకరణ చేస్తారు. అదేరోజు మధ్యాహ్నం భక్తులు నిప్పులగుండం తొక్కుతారన్నారు. ఆఖరి రోజు అన్నదానం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి దర్శనానికి సుమారు లక్ష మంది వచ్చే అవకాశం ఉండటంతో అన్ని ఏర్పాట్లు చేసినట్ట తెలిపారు. ఆలయ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహన్ పెదబాబు దంపతులు అందించిన రూ.5 లక్షల విరాళంతో భారీ కలావేదిక నిర్మాణం పూర్తయింది.

వేధింపులు తట్టుకోలేను..

ఆత్మహత్యే శరణ్యం!



- ఎస్‌ఐ మూర్తి విధుల్లో ఉండగా నాలుగు సార్లు అధికారుల చర్యలు
- ఆ ఒత్తిడితోనే అఘాయిత్యానికి పాల్పడారా?
- స్నేహితుడితో చివరి మాటలు
- సోషల్ మీడియాలో వాయిస్ కాల్

తణుకు రూరల్/భీమవరం క్రైం, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): పోలీసుల వేధింపుల కారణంగానే వీఆర్‌లో వున్న తణుకు రూరల్ ఎస్‌ఐ ఏజీఎస్ మూర్తి గతనెల 31న రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారని సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఎస్‌ఐ ఏజీఎస్ మూర్తి చివరిగా మిత్రుడితో తనకు జరిగిన అన్యాయంపై మాట్లాటంతోపాటు తనపై ఆధారపడిన భార్య, పిల్లలకు దురదృష్టవంతులంటూ చేసిన సంభాషణ ఆదివారం సాయంత్రం నుంచి సోషల్ మీడియాలో వైరల్ అయింది. సంభాషణ వినే వారిని కంటతడి పెట్టిస్తోంది. ఎస్‌ఐ మూర్తి ఇక్కడ గతంలో పనిచేసిన సీఐ నాగేశ్వరరావు, మరో సీఐ పెడుతన్న ఇబ్బందులతో పని చేయలేనని, వీఆర్ నుంచి పోస్టింగ్ ఇచ్చినా కృష్ణా జిల్లాలో ఇస్తామంటున్నారని, అక్కడ పని చేయలేనని, తూర్పు గోదావరి జిల్లాలో అడుగుతున్నానని, కాని ఇక్కడ ఇచ్చే అవకాశం లేదని, ఈ పరిస్థితుల్లో ఆత్మహత్య చేసుకోవడమేనని చెప్పారు. అలాంటి ఉద్దేశం వద్దని అతని మిత్రుడు వారిస్తున్నట్లు ఆ ఆడియోలో వుంది. ఎస్‌ఐ మూర్తి మృతి వెనుక ఏదో జరిగిందని అతని బంధువులు, అతని బ్యాచ్‌కు చెందిన కొందరు ఎస్‌ఐలు, మిత్రులు భావిస్తున్నారు. ఎస్‌ఐ మృతి చెందిన రోజు ఎస్పీ వద్ద మూర్తి ఆత్మహత్య చేసుకునే పిరికివాడు కాదని, వేధింపులే కారణమని విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. వేధింపుల కారణంగానే మృతి చెందారనే వాదనకు ఈ ఆడియో బలం చేకూరుస్తోంది. ఆడియో వైరల్ కావడంతో తణుకు సర్కిల్‌లో పలువురు పోలీస్ సిబ్బంది అనేక వాదనలు చేస్తున్నారు.

నాలుగుసార్లు అధికారుల జులుం

ఎస్‌ఐ మూర్తిపై గతంలో పలు ఆరోపణల కింద విధుల నుంచి తప్పించారు. భీమవరం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న సమయంలో మసాజ్ సెంటర్ల తనిఖీకి వెళ్లి రావడంతో పలు ఆరోపణల కింద వీఆర్‌లోకి పంపించారు. పాలకోడేరు పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఆ మండలంలో అశ్లీల నృత్యాలు జరగడంతో ఎస్‌ఐ మూర్తిని సస్పెండ్ చేశారు. కాళ్ళ పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సమయంలో పేకాట శిబిరంపై దాడి వివాదంలో ఎస్‌ఐ మూర్తిని వీఆర్‌లో ఉంచారు. తర్వాత తణుకు రూరల్ పోలీస్ స్టేషన్‌గా వెళ్లే ముందు అక్కడ జరిగిన కొన్ని సంఘటనల నేపథ్యంలో మూర్తిని వీఆర్‌కు పంపించారు.

వివాదరహితుడైన ఎస్‌ఐ మూర్తిపై అధికారులు ఎందుకు కక్ష గట్టారు..? అతను మృతి చెందే పరిస్థితులపై అధికారులు విచారణ చేయవలసిన అవసరం ఉందని కొందరు భావిస్తున్నారు. ఏది ఏమైనా ఎంతో భవిష్యత్ ఉన్న ఒక యువ పోలీసు అధికారి మరణం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశమైంది.

కొందరు తణుకులో తిష్ట వేశారు..!

తణుకు సర్కిల్‌లో పనిచేసిన సిబ్బందిలో కొందరు దశాబ్ద కాలంగా ఇక్కడే తిష్ట వేశారు. ఉన్నతాధికారులను తమకు అనుకూలంగా మార్చుకుని తోటి సిబ్బందినే వేధింపులకు గురిచేస్తున్నారనే వాదనలు వున్నాయి. బదిలీలు వచ్చినా వాటిని తణుకు సర్కిల్ పరిధిలో ఏదో ఒక స్టేషన్‌కు మార్చుకున్నారే తప్ప సర్కిల్ దాటి వెళ్లలేదని తెలుస్తోంది. దీనితో కానిస్టేబుల్‌గా చేరిన వ్యక్తి ఏఎస్‌ఐ, ఎస్‌ఐగా ఇక్కడే పదోన్నతులు పొందుతున్నారని చెబుతున్నారు. తణుకు ప్రాంతంలోని కొన్ని అసాంఘిక కార్యపాలు నిరాటంకంగా సాగుతున్నా వాటిపై కన్నెత్తి చూడకుండా, ఇతర సిబ్బంది అటువైపు వెళ్లకుండా కట్టడి చేయడంలో వీరు ఆరితేరినట్లు కొందరు పోలీసులే ఆరోపిస్తున్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా కిందిస్థాయి కేడర్‌తో పనులు చేయించుకుంటూ తమ స్థానాన్ని పదిలపర్చుకునే వారని కొందరు పోలీసులు చెబుతున్నారు. సంక్రాంతి కోడి పందేల బరుల వద్ద తణుకుకు చెందిన కొందరు పోలీసులు ఒక బృందంగా వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపణలు బలంగా ఉన్నాయి.

పేకాట లాబీయింగ్..?

తణుకు ప్రాంతంలో పేకాట, క్రికెట్ బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోయాయని ప్రజలతోపాటు, పోలీస్ సిబ్బంది కూడా ఆరోపిస్తున్నారు. తణుకు పట్టణానికి చెందిన పేకాటరాయుళ్లు తణుకుతోపాటు పొరుగు జిల్లాలోని ఓ మండలంలో పేకాట శిబిరాన్ని ఏర్పాటు చేసుకునేందుకు ఏడాది క్రితం అనుమతి ఇచ్చినట్లు సమాచారం. రోజూ కొంత మొత్తాన్ని ఎస్‌ఐకు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నట్లు పోలీసులే పేర్కొంటున్నారు. తణుకులో ఓ హోటల్‌పై దాడి చేసి పేకాడుతున్న వారి నుంచి పెద్ద మొత్తంలో నగదు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారని, దొరికింది ఎంత? లెక్క రాసింది ఎంత? అనేది మిస్టరీగా మారిందని పోలీసులే పేర్కొంటున్నారు. వేల్పూరులో గేదెల దొంగతనం కేసులో దొంగల నుంచి గేదెల బదులు సొమ్ములు ఇప్పించేందుకు కొందరు సిబ్బంది పేకాటరాయుళ్ల మధ్యవర్తిత్వం కోరినట్లు తెలిసింది. మధ్యవర్తిత్వం వహించిన పేకాటరాయుళ్లే సొమ్ములు ఇచ్చే సమయంలో వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం, కొన్ని చానల్స్‌లో ప్రసారం చేయడంతో మొత్తం వ్యవహారం బట్టబయలైంది.

ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు

తొలిరోజు ఒక నామినేషన్

ఈ నెల 10 వరకు స్వీకరణ.. 8, 9 తేదీల్లో సెలవు



కలెక్టర్ వెట్రిసెల్వికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న రాజేంద్ర

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ తొలిరోజు సోమవారం ఒక నామినేషన్ దాఖలైంది. కాకినాడకు చెందిన పేపకాయల రాజేంద్ర నామినేషన్ దాఖలు చేశారు. ఏలూరు కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి పేపకాయల రాజేంద్ర ఒక సెట్ నామినేషన్ పత్రాన్ని సమర్పించారు. అభ్యర్థి రాజేంద్రతో రిటర్నింగ్ అధికారి ప్రమాణం చేయించారు. సోమవారం నామినేషన్ల స్వీకరణ చేపట్టగా ఈనెల 10 వరకు గడువు ఉంది. మధ్యలో ఈనెల 8, 9 తేదీలు సెలవు రోజులు మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఏలూరు కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ నెల 11న పరిశీలన, 13న మధ్యాహ్నం 3గంటల వరకు ఉపసంహరణకు గడువు ఉంది. 27 ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. మార్చి 3న ఏలూరులో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఎమ్మెల్సీ ఎన్నికలకు 440 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 3,15,261 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

ఆర్వో, కలెక్టర్ వెట్రిసెల్వి

ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో పట్టభద్రుల నియోజకవర్గంలో అల్లూరి సీతారామరాజు, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో మొత్తం 440 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. 3,15,261 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందన్నారు. ఇప్పటివరకు అందిన 8,501 క్లెయిమ్‌లు పరిశీలించి 5వతేదీలోపు ఈఆర్‌వో నెట్‌లో అప్‌డేట్ చేస్తామన్నారు.

ఏలూరు డివిజన్‌లోని 8మండలాల్లో 37 పోలింగ్ స్టేషన్లు, జంగారెడ్డిగూడెం డివిజన్‌లోని 10 మండలాల్లో 23 పోలింగ్ స్టేషన్లు, నూజివీడు డివిజన్‌లోని 2 మండలాల్లో 6 పోలింగ్ స్టేషన్లు ఉంటాయన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా నాటికి 440 పోలింగ్ కేంద్రాలు ఉండగా వీటిని అనుబంధంగా 16 పోలింగ్ స్టేషన్లు ప్రతిపాదించడం జరిగిందన్నారు. ఏలూరు జిల్లాకు సంబంధించి ఏఆర్‌వోగా డిప్యూటీ కలెక్టర్ ఎం ముక్కంటి వ్యవహరిస్తారన్నారు. ఏలూరు జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏలూరు జిల్లాలో 16,077 మంది ఓటర్లు ఉండగా 9858 మంది పురుషులు, 6218 మంది మహిళలు, ఒక ట్రాన్స్‌జండర్ ఉన్నారన్నారు. 20 పోలింగ్ కేంద్రాలకు అదనంగా మరో పోలింగ్ కేంద్రాన్ని ప్రతిపాదించటం జరిగిందన్నారు. సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారి, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు నెరుసు నెలరాజు, ఎస్ అచ్యుతబాబు, యు.బాలానందం, ఎస్.సత్యనారాయణ, సిర్రా భరత్, ఎస్‌కె.బాషా, ఎస్ ఆదిశేషు, తదితరులు పాల్గొన్నారు.

ఆ నియామకాలు ఆపేశాం!

- ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకంపై ఎమ్మెల్యే బాలరాజు ప్రకటన
- టి.నరసాపురం మండలంలో కూటమి మధ్య కుదరని సఖ్యత
- నేతల్లో ఆధిపత్య పోరు



ఫీల్డ్ అసిస్టెంట్ల నియామక పత్రం, తిరుమలదేవి పేటలో జరుగుతున్న ఉపాధి పనులు

టి.నరసాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాలు వివాదస్పదంగా మారాయి. 15 గ్రామ పంచాయతీల్లో 18 ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగాలు కేటాయింపులో కూటమి నాయకుల మధ్య వివాదం నెలకొంది. ఉద్యోగాల కేటాయింపు విషయంలో అధికార టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు తాము చెప్పిన వారినే, తాము చెప్పిన చోటనే నియమించాలని అధికారుల వద్ద పట్టుబడుతున్నారు. ఎవరికి కేటాయించాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటివరకు జరిగిన ఫీల్డ్ అసిస్టెంట్లు నియామకంలో కూటమి నేతల మధ్య ఆధిపత్య పోరు తారస్థాయికి చేరింది. ఇప్పటికే ఐదు పంచాయతీల్లో ఐదుగురిని నియమిస్తూ అధికారులు నియామక పత్రాలు జారీ చేయగా అందరి నియామకాలు నిలిపివేస్తున్నట్లు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు చేసిన ప్రకటన మండలంలో చర్చనీయాంశంగా మారింది.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మండలంలో 15 పంచాయతీల పరిధిలో పనిచేస్తున్న ఉపాధి హామీ సిబ్బంది 18మందిలో 15 మంది రాజీనామా చేశారు. మిగిలిన ముగ్గురు పనిచేయడం లేదని విధుల నుంచి తొలగించాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు అధికారులు తెలిపారు. ఆ ఖాళీలను భర్తీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.


మా వాళ్లనే నియమించాలి..!

మండలంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు పంచాయతీల్లో తాము చెప్పిన వారినే నియమించాలని, ఒకే పంచాయతీలో మావాళ్లనే పెట్టాలంటూ టీడీపీ నేతలు.. లేదు మావారిని పెట్టాలంటూ జనసేన.. అంతేకాక టీడీపీలోనే మరోవర్గం కూడా తమ వారిని పెట్టాలంటూ ఎవరికి వారే పలు పేర్లు అధికారులకు అందించినట్లు తెలుస్తుంది. చివరకు టీడీపీకి 10, జనసేనకు 6, బీజేపీకి 2 పంచుకునే విధంగా పలుమార్లు నేతల మధ్య పంచాయతీ జరిగినట్లు సమాచారం. కాగా గత నెలలో అల్లంచర్ల, వెలగపాడు, రాజుపోతేపల్లి, బంధంచర్ల, తిరుమలదేవిపేట పంచాయతీలకు చెందిన ఐదుగురిని నియమిస్తూ ఎంపీడీవో నియామక పత్రాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాలు నిలిపివేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించడం కలకలం రేపింది. త్వరగా ఫీల్డ్ అసిస్టెంట్‌లను నియమించి ఉపాధి పనులు కల్పించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై వివరణ కోరగా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు నియామకం చేస్తామని ఎంపీడీవో మణికుమారి చెప్పారు.

భార్య మోసగించడంతో..

భర్త ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నువ్వంటే ఇష్టం అంటూ దగ్గరైంది. పెళ్లి చేసుకుంది. ఒక బిడ్డకు జన్మనిచ్చింది. తర్వాత మరో యువకుడిపై మోజుపడింది. ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్తను కాదని ప్రియుడి వద్దకు వెళ్లిపోవడంతో తట్టుకోలేని భర్త ఆమె చున్నీతోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు నగరంలో ఈ సంఘటన సోమవారం జరిగింది. తంగెళ్ళమూడి ప్రాంతం పుష్పలీలా నగర్ కు చెందిన బోను సాయిదుర్గారావు (28) తాపీ పనులు చేస్తాడు. ఒక యువతి పరిచయం కావడంతో ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వారికి ఒక పాప ఉంది. మరో యవకునితో ఆమె వివాహేతర సంబంధం కొనసాగించడంతో దుర్గారావు మందలించాడు. అతనే ఇష్టమంటూ దుర్గారావును విడిచిపెట్టి వెళ్లిపోయింది. భార్య మోసగించిందని జీవితంపై చెంది సోమవారం దుర్గారావు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అతడి భార్యపై టూటౌన్ సీఐ వైవి రమణ ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఆర్ నాగకల్యాణి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



సంఘటనాస్థలంలో నాగరాజు మృతదేహం

గుర్తు తెలియని వాహనం ఢీకొని

ఒకరి మృతి

ఉంగుటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వెంకట్రామన్నగూడెం హార్టీకల్చర్ విశ్వ విద్యాలయం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. చేబ్రోలు పోలీసుల కథనం ప్రకారం ఉంగుటూరు మండలం వెల్లమిల్లి శివారు చింతాయిగూడెం గ్రామానికి చెందిన మన్ని నాగరాజు(38) తన కుమారుడిని గోపాలపురం కళాశాలకు తీసుకువెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో నాగరాజు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య దుర్గ, ఇద్దరు కుమారులు లక్ష్మణస్వామి (ఇంటర్ ఫస్టియర్), సాయి ప్రభాకర్ (10వ తరగతి) ఉన్నారు. నాగరాజు భార్య దుర్గ ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.సూర్య భగవాన్ కేసు నమోదు జరిపి దర్యాప్తు జరుపుతున్నారు.

వృద్ధుడి మృతి

ఉంగుటూరు,ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): భీమడోలు మండలం పూళ్ళ-చిట్యాలపాడు రైల్వే గేటు సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందాడు. భీమడోలు పోలీసుల కథనం ప్రకారం ఉంగుటూరు మండలం కైకరం గ్రామానికి చెందిన జాగారపు నాగేశ్వరరావు(69) భీమడోలు జంక్షన్‌లో రాజా యజమాని వద్ద పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం తన కుమార్తె ఇంటికి సైకిల్‌పై బయలుదేరి కైకరం వెళుతున్నాడు. నాగేశ్వరరావును గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమార్తె నక్కా లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకరరావు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని..

కుక్కునూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): నెమలిపేట గ్రామ శివారులో ఆదివారం మోటార్ సైకిల్‌ను ట్రాక్టర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం చింతలగూడెం గ్రామానికి చెందిన ఐతంరాజు శ్రీనివాస్, పూజారి దుర్గాప్రసాద్ ద్విచక్ర వాహనంపై వేలేరుపాడు మండలంలో శుభకార్యం నిమిత్తం వెళుతున్నారు. ఇదే సమయంలో నెమలిపేట నుంచి కుక్కునూరు వైపు వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో వాహనం నడుపుతున్న ఐతంరాజుల శ్రీనివాస్(42) తీవ్రంగా గాయపడ్డాడు. వెనుక కూర్చున్న దుర్గాప్రసాద్ గాయపడ్డాడు. వారిని 108 వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించగా శ్రీనివాస్ మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి వాహనాన్ని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

చిన్నారులను హింసించిన

నిందితుడి అరెస్ట్

- జంగారెడ్డిగూడెం ఘటనలో హత్యాయత్నం కేసు నమోదు
- తల్లిపై కూడా కేసు
- బాలల హక్కుల కమిషన్ సభ్యుడి ఆరా



పోలీసుల అదుపులో నిందితుడు పవన్, ఆస్పత్రిలో బాధిత చిన్నారులను పరామర్శిస్తున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు రాజేంద్రప్రసాద్

ఏలూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణంలో ఇద్దరు చిన్నారులను పైశాచికంగా హింసించి తీవ్రంగా గాయపరచిన నల్లవెలుగుల పవన్ కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. చిత్రహింసను అడ్డుకోని చిన్న పిల్లల తల్లిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

పట్టణంలోని సీఐ కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రవిచంద్ర వివరాలు తెలిపారు. నిందితుడు పవన్ కుమార్, అతడితో సహజీవనం చేస్తున్న శారద ఏకాంతానికి అడ్డుగా ఉన్న పిల్లలను ఘోరంగా హింసించేవాడన్నారు. ఈ నెల 1న రాత్రి బాలుడు రాహుల్‌ను పవన్ వైర్‌తో బలంగా కొట్టడంతో భయపడి ఇంటి నుంచి బయటకు పారిపోతూ స్థానికుల సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. ఘటన తరువాత పవన్ పరారు కావడంతో ఎస్సై జబీర్ స్థానికుల సహకారంతో సోమవారం అరెస్ట్ చేశామన్నారు. పిల్లలను విచక్షణారహితంగా కొట్టిన నిందితుడు పవన్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరు పరుస్తామన్నారు. పిల్లలను కొట్టిన సంఘటనలో వారి తల్లి శారదపై కూడా కేసు నమోదు చేశామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ వి.కృష్ణబాబు, ఎస్సై ఎస్‌కె.జబీర్ సిబ్బంది ఉన్నారు.

కఠిన చర్యలు తప్పవు

బాలల హక్కులకు భంగం కలిగించి వారిపై దాడులకు పాల్పడిన వారిపై జువైనల్ చట్టం కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు జె.రాజేంద్రప్రసాద్ అన్నారు. నిందితులకు రూ.లక్ష జరిమానా, మూడేళ్ల జైలు శిక్ష విధించబడుతుందని తెలిపారు. ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాహుల్, రేణుకను సోమవారం ఆయన పరామర్శించారు. ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూలాను సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పసిబిడ్డ నుండి 18 ఏళ్లలోపు బాలలను శారీరకంగా, లైంగికంగా వేధించిన వారిపై జువైనల్ చట్టం కఠిన శిక్షలు పడతాయని హెచ్చరించారు. రాహుల్, రేణుకను హింసించిన పవన్‌పై జువైనల్ జస్టిస్ సెక్షన్ 75 ప్రకారం కేసు నమోదు చేయాలని ఎస్సై జబీర్‌కు సూచించారు. కఠిన చట్టాలు అమలైతేనే ఇటువంటి ఘటనలు నిరోధించవచ్చన్నారు. ఆయనతో పాటు ఎంఈవో రాములు, కౌన్సిలర్లు రమాదేవి, జ్యోతి, టీడీపీ నాయకురాలు పగడం సౌభాగ్యవతి, మారిశెట్టి బాల చిట్టెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

'కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి విజయం ఖాయం'



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయం ఖాయమని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి, పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అధ్యక్షతన సోమవారం జరిగిన కూటమి ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి 30 మంది ఓటర్లకు కూటమి ప్రతినిధిని నియమించి ఎన్నికల ప్రచారం చేయాలన్నారు. పేరాబత్తుల రాజశేఖరానికి మొదటి ప్రాధాన్య ఓటు వేయించి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏపీఐఐసీ ఛైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు మాట్లాడుతూ గ్రామాలు, ప్రాంతాలు, వార్డుల వారీగా అభ్యర్థి విజయానికి పనిచేయాలన్నారు. తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ మూడు పార్టీల నాయకులు ఉమ్మడి కార్యాచరణ, కృషితో పని చేద్దామన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, దాసరి ఆంజనేయులు, మెంటే పార్థసారధి, కోళ్ళ నాగేశ్వరరావు, వేండ్ర శ్రీనివాస్, వీరవల్లి దుర్గాభవాని, మెరగాని నారాయణమ్మ, గుల్లపల్లి విజయలక్ష్మి, సయ్యద్ నసీమా బేగం, ఆకుల మౌనిక, వై.ఇందిర, ఎండి షబీనా, గంధం రాధ, ఐ. సుబ్రహ్మణ్యరాజు, జి.సుబ్బారావు, కొల్లేపర శ్రీనివాసరావు, రేవు వెంకన్న, కె.వీర వెంకట నరసింహారావు, కె.గణపతి, కె.వాసు, పి.సుధాకర్, మోకా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో సూత్ర ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్ సందర్శించిన మహిళలు

భీమవరం టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న సూత్ర ఎగ్జిబిషన్ ఆనంద ఇన్‌లో సోమవారం ప్రారంభమైంది. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్లు, లైఫ్‌స్టైల్ బ్రాండ్‌లు, లగ్జరీ కలెక్షన్‌లను, వెడ్డింగ్ ఆభరణాలు అందుబాటులో ఉంచారు. శ్వేతా గుల్గులియా (కోల్‌కతా), పండోర ఆర్ట్ ఆభరణాలు, ప్రత్యేక ఆభరణాలు సాన్విక ఇల్లు, తపస్వి డిజైనర్ (ముంబై), విమ దిలీప్ రివాజ్ (ముంబై), సాయి బోటిక్ చీరలు, దుస్తులు, నగలు అందుబాటులో ఉన్నాయి. సోమ, మంగళవారాల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్

న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా మార్చి 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో న్యాయసేవాధికార సంస్థ భవనంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో మార్చి 8న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని చెప్పారు. రాజీయోగ్యమైన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, వాహన ప్రమాద బీమా కేసులు, కుటుంబ వివాదాలు, చిట్‌ఫండ్స్ వివాదాలు, బ్యాంకు లావాదేవీల కేసులు, టెలిఫోన్ బకాయిల కేసులు, మున్సిపల్, ఆస్తి, నీటి పన్నుల కేసులు ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీచేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి శనివారం అన్ని కోర్టులలో ప్రి లోక్ అదాలత్ సిటింగ్స్ నిర్వహిస్తున్నారని, పర్మినెంట్ లోక్ అదాలత్ ఛైర్మన్ ప్రతి రోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం నిర్వహిస్తున్నారని ఏలూరు కోర్టు పరిధిలోని కేసులను కూడా ఆన్‌లైన్ విధానం ద్వారా ఈ మధ్యవర్తిత్వం ద్వారా హాజరై తమ కేసులను రాజీ చేసుకోవచ్చునని తెలిపారు. ఈ కేసులలో సమస్యలు ఎదురైతే 08812-224555 ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించాలని తెలిపారు. గత డిసెంబర్ 14న నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో వివిధ కేసులకు సంబంధించి 5,616 కేసులను పరిష్కరించుకొని కక్షిదారులు విముక్తి పొందారని, అదే విధంగా 2025 మార్చి 8న జాతీయ లోక్ అదాలత్‌కు 3,746 కేసులను పరిష్కారానికి మధ్యవర్తిత్వం ద్వారా గుర్తించడం జరిగిందని తెలిపారు.

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో గల 11 మండల లీగల్ సర్వీసెస్ కమిటీలతో కూడా కేసులను పరిష్కరించుకోవడానికి ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. అదే విధంగా ఇంకా కక్షిదారులు ఎవరైనా ఉంటే వారు కూడా మార్చి 8వ తేదీన జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవడానికి ముందుకు రావాలని తెలిపారు. కక్షిదారులు జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగ్గురు దొంగల అరెస్ట్

96 గ్రాముల బంగారం, 46 గ్రాముల వెండి, స్కూటీ స్వాధీనం

ఏలూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటుపడి ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను జంగారెడ్డిగూడెం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.9.80 లక్షల విలువైన 96 గ్రాముల బంగారం, 46 గ్రాముల వెండి, ఒక స్కూటీ స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. సీఐ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు తెలిపారు. 2024 ఆగస్టు 2న జంగారెడ్డిగూడెం పట్టణంలో ఏరియా ఆసుపత్రి ఎదురుగా ఉన్న గూండా శివప్రసాద్ ఇంట్లో చోరీ జరిగింది. ఈ కేసులో పట్టణానికి చెందిన కంభపు వెంకటరమణ, వేముల శ్రీకాంత్ దొంగిలించిన 35 గ్రాముల బంగారం రికవరీ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. గత జనవరి 23న పట్టణంలోని మారుతీ నగర్‌లో షేక్ బాషా ఇంట్లో గుంటూరుకు చెందిన తిరువీధుల మహేష్ ఆభరణాలు దొంగిలించాడు. ఈ కేసులో 57 గ్రాముల బంగారం, 46 గ్రాముల వెండిని స్వాధీనం చేసుకున్నామన్నారు. మహేష్ తాడేపల్లిగూడెంలో దొంగిలించిన 4 గ్రాముల బంగారం, ఒక స్కూటీ కూడా స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తామని ఆయన తెలిపారు. దొంగతనం కేసులు ఛేదించడానికి సహకరించిన ఏఎస్సైలు సంపత్ కుమార్, రాజేంద్రప్రసాద్, కానిస్టేబుళ్లు రమేష్, రాజశేఖర్‌ను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో సీఐ వి.కృష్ణబాబు, ఎస్సై ఎస్‌కె.జబీర్ పాల్గొన్నారు.

వైద్యుడి ఇంట్లో బంగారం చోరీ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వైద్యుడి బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశారు. ఏలూరు ఎన్‌ఆర్‌పేటనకు చెందిన వైద్యుని కుమార్తె గత నెల 26న ఉదయం 11.30 గంటలకు బెడ్‌రూమ్‌లో పడుకుంటూ తన నగలను తీసి పక్కన పెట్టారు. తిరిగి 1.30 గంటలకు లేచి చూసేటప్పటికి నగలు కనిపించలేదు. అప్పటి నుంచి వాటి కోసం ఆరా తీశారు. వారి ఇంట్లో పనిచేసే పనివారే ఈ నేరానికి పాల్పడ్డారని ప్రాథమికంగా గుర్తించి ఏలూరు టూటౌన్ పోలీసులకు ఆ వైద్యుడు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అపహరణకు గురైన బంగారపు వస్తువులు 40 గ్రాములని ఫిర్యాదులో పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు డేగా ప్రభాకర్

దాలి నాయుడు సేవలు ప్రశంసనీయం

సంతాప సభలో నివాళులర్పించిన డేగా ప్రభాకర్

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : సత్రంపాడు ఎంఆర్‌సీ కాలనీకి చెందిన సీనియర్ నాయకుడు చింతల దాలినాయుడు ఆదర్శనీయులని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ అన్నారు. సోమవారం ఏలూరు ఏరియా సీపీఐ సమితి ఆధ్వర్యంలో సీనియర్ నాయకుడు దాలి నాయుడు సంతాప సభను సత్రంపాడు ఎంఆర్‌సీ కాలనీలో ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డేగా ప్రభాకర్, మన్నవ కృష్ణలు హాజరై దాలి నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

రైల్వే బడ్జెట్‌లో ఏపీకి అధిక కేటాయింపులు : టీడీపీ

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : రైల్వే బడ్జెట్‌లో రాష్ట్రానికి రికార్డు స్థాయిలో రూ.9,417 కోట్లు కేటాయించడం పట్ల టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కూటమి ఎంపీల కృషి వల్ల రాష్ట్రానికి అధిక నిధులు బడ్జెట్‌లో కేటాయించారని అన్నారు. కేంద్రం రాష్ట్రానికి కేటాయించిన నిధులను రాష్ట్రంలో కొత్త రైల్వే ప్రాజెక్టులకు ఉపయోగిస్తారని అన్నారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ ప్రత్యేక కృషి వల్లే ఏలూరు జిల్లా రైల్వే స్టేషన్ రూపు రేఖలు మారనున్నాయని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పంచాయతీ పన్నులు సకాలంలో చెల్లించాలి

పోలవరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : పంచాయతీ పన్నులు సకాలంలో చెల్లించి అభివృద్ధికి తోడ్పడాలని పోలవరం పంచాయతీ కార్యదర్శి వై.కొండలరావు కోరారు. సోమవారం పోలవరం పంచాయతీలో మైకు ద్వారా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ ఇంటిపన్ను, కుళాయి పన్ను, షాపు లైసెన్సు ఫీజులు, ఇతర బిల్లులు వెంటనే బిల్ కలెక్టర్‌కి చెల్లించి రశీదులు పొందాలని కోరారు. బిల్లులు సకాలంలో చెల్లించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'విద్యార్థుల ఏకాగ్రతకు భంగం కలిగించొద్దు'

పోలవరం ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) :ఇంటర్, టెన్త్ విద్యార్థులకు పరీక్షల సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో సబ్ డివిజన్ పరిధిలో అన్ని మండలాల్లో శబ్ద కాలుష్యాన్ని నివారించడంలో తోడ్పడాలని డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం డీఎస్పీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ చర్చిలు, దేవాలయాలు, మసీదుల్లో మైకుల శబ్దకాలుష్యాన్ని తగ్గించాలని సూచించారు. పరీక్షలు ముగిసే వరకు విద్యార్థుల ఏకాగ్రతకు భంగం కలిగించకుండా సహకరించాలని అన్నారు. పోలవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఇ.శ్రీనివాస్ మాట్లాడుతూ చర్చిలు, మసీదులు, దేవాలయాల్లో మైకుల శబ్ద నియంత్రణ పాటించాలని సూచించారు.

గిరిజన చట్టాలు నిర్వీర్యం : సీపీఐ

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన చట్టాలను అధికారులు పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ఆరోపించారు. సోమవారం టి.కట్టుపల్లిలోని భూపోరాట స్థలాలను సీపీఐ, బీకేఎంయు, ఎస్ఎఫ్ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో పరిశీలించారు. గిరిజనులు 40 సంవత్సరాలుగా సాగుచేస్తున్న 12.66 ఎకరాల భూములకు తహసీల్దార్ ప్రొటెక్షన్ అర్డర్లు ఇచ్చి పోలీసులను భూముల్లోకి పంపి గిరిజనులను భయపెడుతున్నారని, చేతికొచ్చిన పంటను నాశనం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.వెంకటేశ్వరరావు, శ్యామల, యామిని, పి.కన్నబాబు, చోడెం దుర్గ, బేతి కిషోర్, టి.మునేశ్వరావు, ముత్యాలమ్మ, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో దూషించిన వ్యక్తిపై కేసు

భీమడోలు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : భీమడోలులోని దిగులు పాటిదిబ్బకు చెందిన పితాని వెంకట నరసయ్యపై దాడి చేసిన వనం వెంకట రత్నం అనే వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. భీమడోలు పోలీసుల కథనం ప్రకారం వనం వెంకట రత్నం ప్రతి రోజు మద్యం తాగి కాలనీవాసులను ఇష్టమొచ్చినట్టు దూషిస్తున్నాడని, ఇదే తరహాలో వెంకట నరసయ్యను వారి కుటుంబ సభ్యులను తిడుతుండగా ఇదేమిటని మందలించారు. దీంతో వెంకట రత్నం తన చేతిలో ఉన్న ఇనుపరాడ్డుతో వెంకట నరసయ్యపై దాడి చేయడంతో ఆసుపత్రి పాలయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వెంకట రత్నాన్ని అరెస్టు చేశారు.



భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న రాములు నాయక్

భవన నిర్మాణాల నాణ్యతలో రాజీ వద్దు

సిబ్బందికి సూచించిన ఐటీడీఏ పీవో రాములు నాయక్

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా కె.ఆర్.పురం ఐటీడీఏ ద్వారా ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న అదనపు భవనాల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని పీవో, ఆర్ అండ్ఆర్ ఆఫీసర్ కె.రాములు నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం తెల్లంవారిగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి భవన నిర్మాణాలను పరిశీలించారు. లోపాలు లేకుండా భవనాలను పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులు భోజనాలు చేస్తుండగా వారితో కలిసి భోజనం చేసి పదార్థాల నాణ్యతను పరిశీలించారు. మెను సక్రమంగా అమలు చేయాలని, ఆహార పదార్థాలు రుచికరంగా ఉండేలా చూసుకోవాలని వార్డెన్ ఉదయ్‌శ్రీని ఆదేశించారు. 10వ తరగతి విద్యార్థినులతో మాట్లాడిన ఆయన నూరుశాతం ఉత్తీర్ణతను సాధించాలని సూచించారు. పీవో వెంట ఇంజనీరింగ్ అధికారులు డీఈ శ్రీనివాసరావు, ఏఈ సత్యన్నారాయణ, హెచ్ఎం పి.వసుంధరమ్మ, సిబ్బంది ఉన్నారు.



అజ్ఞాత వ్యక్తి అందజేసిన వీల్ చైర్స్

ఆరు వీల్ చైర్లు బహూకరించిన అజ్ఞాత వ్యక్తి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం సోమవారం ఒక అజ్ఞాత దాత ఆరు వీల్ చైర్స్‌ను అందించారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు చెప్పారు. వీల్ చైర్స్‌ను అందించిన తన వివరాలు తెలియజేయవద్దని కోరారన్నారు. సదరు వీల్‌చైర్‌ను రోగులను వివిధ వార్డులకు తీసుకువెళ్లేందుకు వినియోగించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, నర్సింగ్ సిబ్బంది ఎస్తేర్ రాణి, అమ్మాజీ, భారతి తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీ హయగ్రీవ లలితాశ్రీ పీఠంలో అక్షరాభ్యాసం



టి.నరసాపురంలో సర్వతీ దేవి



ఉంగుటూరులోని సరస్వతీ పూజలో పాల్గొన్న విద్యార్థులు

ఆలయాల్లో వసంత పంచమి పూజలు

ఆకట్టుకున్న సామూహిక అక్షరాభ్యాసాలు

ఏలూరు కార్పొరేషన్ / పోలవరం / కామవరపుకోట/ టి.నరసాపురం/ఉంగుటూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లోని శ్రీ పాండురంగ స్వామి ఆలయ ప్రాంగణంలో వసంత పంచమిని పురస్కరించుకుని సోమవారం ఆలయ అర్చకులు దండిబొట్ల కనకసుందర శర్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు సామూహిక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్.చిననాగేశ్వరరావు భక్తులకు ఏర్పాట్లు చేశారు. సత్రంపాడులోని అంబికా దేవి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ప్రధాన అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ సామూహిక పూజలు జరిపించారు. పోలవరంలోని శ్రీసాయి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో విద్యార్థులు ఉపాధ్యాయులు సరస్వతీ పూజలు ఘనంగా నిర్వహించారు. పూజల్లో భాగంగా తీర్థ ప్రసాదాలు, బిస్కెట్లు పలకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయురాలు కొణతాల గీతాప్రభ, ఉపాధ్యాయులు పెద్దింటి నాగేశ్వరరావు, దేవి శెట్టి రంగమణి, సత్యన్నారాయణ, నాగేంద్ర, యామినీ పాల్గొన్నారు. కామవరపుకోట లక్ష్మీ హయగ్రీవ లలితా శ్రీపీఠంలో పీఠం వ్యవస్థాపకులు సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు, సత్య శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో భాగంగా సరస్వతీదేవికి కుంకుమార్చనలు నిర్వహించారు. టి.నరసాపురం గ్రామంలో ఉన్న శ్రీ అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో పంచమి సందర్భంగా సోమవారం స్వామికి రుద్రాభిషేకంతో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఉంగుటూరు మండలంలో వసంత పంచమిని పురస్కరించుకుని సోమవారం స్థానిక విజ్ఞాన భారతి పాఠశాలలోను భద్రకాళి ఆలయంలోను వివిధ ఆలయ ప్రాంగణాలలోను చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు.ఇందులో భాగంగా పలువురు చిన్నారులకు పలక బలపాలు దాతలు అందించారు.

మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కట్టడికి చర్యలు

- ఎంపీ పుట్టా మహేష్ కుమార్

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల అక్రమణ రవాణా కట్టడికి కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కట్టడికి కేంద్రం తీసుకుంటున్న చర్యలపై పార్లమెంట్‌లో ఎంపీ మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి సమాధానమిచ్చారు. గత ఐదేళ్లలో ఓడరేవుల్లో 11 వేల 669 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను సీజ్ చేశామని ఏపీలో 21,048 కేసులు నమోదు చేసినట్టు మంత్రి పార్లమెంట్ వేదికగా స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల అనర్థాల వలన అవగాహన కల్పించేందుకు ఎన్‌సీబీ మిషన్ స్పందన్‌తో పాటు మరో ఐదు సంస్థలతో కేంద్రం ఒప్పందం కుదుర్చుకుందని, ప్రతి ఏటా జూన్ 26న మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. మాదక ద్రవ్యాల బారిన పడిన వారిని ఆదుకునేందుకు కేంద్రం రూ.2 కోట్ల 9లక్షలు మంజూరు చేసిందన్నారు.

జనసేనలో క్రియాశీలక సభ్యులకు ఎల్లప్పుడూ గుర్తింపు : నాదెండ్ల

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): దేశంలో ఏ రాజకీయ పార్టీలో లేని విధంగా జనసేనలో క్రియాశీలక కార్యకర్తలకు, నాయకులకు గుర్తింపునిస్తోందని, రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఏలూరులో సోమవారం ముఖ్య నాయకులతో సమావేశం అనంతరం జనసేన పార్టీ నాయకులు నారాశేషు నివాసానికి మంత్రి విచ్చేశారు. ఈ సందర్భంగా నారాశేషు కుటుంబ సభ్యులు శ్రీవారి చిత్రపటం, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, ఉంగుటూరు ఎమ్మెల్యే పచ్చమట్ల ధర్మరాజు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు, కరాటం సాయి, చంద్రశేఖర్, వాసు, రఘు, ఇళ్ళ శ్రీనివాస్ పాల్గొన్నారు.



జ్ఞాపిక అందజేస్తున్న నారాశేషు కుటుంబ సభ్యులు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి విజయం తథ్యం : చింతమనేని

పెదవేగి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థి విజయం తథ్యమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దెందులూరు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్‌తో కలిసి ఎన్నికల ప్రక్రియపై సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో టీడీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రభాకర్ మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గంలో 8వేల మంది వరకు గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారని, వారిలో ఏడు వేలకు తగ్గకుండా ఓట్లు వేసేలా అవగాహన కల్పించడంతో పాటు కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసేలా ఓటర్లకు అవగాహన కల్పించేలా బూత్ లెవెల్ నుంచి విస్తృత ప్రచారం చేపడుతున్నామని చెప్పారు. కూటమి అభ్యర్థి గెలుపునకు ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఉప్పలపాటి శ్రీరామ్ ప్రసాద్, బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, గారపాటి రామసీత, కె.ప్రభాకర్, మాగంటి నారాయణ ప్రసాద్, లావేటి శ్రీనివాస్, ముంగర నాగరాజు, గుత్తా అనిల్, మంచినేని శ్రీనివాసరావు, కొనకళ్ళ శివమణి, మాదు రవికుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని

ఎమ్మెల్యే సొంగా రోషన్ ఆధ్వర్యంలో...

లింగపాలెం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఎన్డీఏ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో స్థానిక నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అభ్యర్థి గెలుపునకు నాయకులంతా ప్రచారం చేయాలని అన్నారు.

హత్యాయత్నంపై కేసు నమోదు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : పాత కక్షల నేపథ్యంలో మద్యం సీసా పగులగొట్టి మెడపై గాయపర్చిన వ్యక్తిపై కేసు నమోదైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏలూరు త్రి టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పెదవేగి మండలం పినకడిమి గ్రామానికి చెందిన మరీదు మణికంఠ(25), అతని బంధువైన మరీదు మణికంఠ(22)లకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. పెద్దలు రాజీ కుదిర్చి పరిష్కారం చూపారు. అప్పటి నుంచి కలిసే ఉంటున్నారు. అయితే 2వ తేదీ రాత్రి ఆటోలో మద్యం తాగడానికి ఆ గ్రామ శివారున పొలాలకు వెళ్లారు. మద్యం మత్తులో ఇద్దరూ ఘర్షణ పడ్డారు. ఆగ్రహించిన మణికంఠ తన బాబాయి అయిన మరీదు మణికంఠను మద్యం సీసా పగలగొట్టి మెడపై గాయపర్చాడు. గాయపడిన మణికంఠ తన బంధువులకు ఫోన్ చేయగా వచ్చి వారు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఏలూరు త్రి టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న మణికంఠ (22) కోసం పోలీసులు గాలిస్తున్నారు.

బీజేపీకి ప్రాధాన్యం ఇవ్వండి

దెందులూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో ఇచ్చే నామినేటెడ్ పదవుల్లో నియోజకవర్గంలో తప్పకుండా బీజేపీ నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలని దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ గుమ్మడి వెంకట చైతన్య కృష్ణ, మండల నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతి పత్రం అందజేశారు. ఏలూరులోని ఎస్.హోటల్లో ఉన్న మంత్రి మనోహర్‌ను కలిసి బీజేపీ మండలాధ్యక్షుడు శంఖారావు, చీకటి ప్రభు, లక్ష్మీప్రసన్న వినతిపత్రం అందజేశారు. ముందుగా జిల్లా మంత్రికి బొకేను అందించి శాలువాతో సత్కరించారు.



మంత్రిని కలిసి బొకే ఇస్తున్న బీజేపీ నాయకులు

క్లాప్ డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తొలగించి 60 మంది క్లాప్ ఆటో డ్రైవర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని నగరపాలక సంస్థ క్లాప్ ఆటోడ్రైవర్ల సంఘం నాయకులు సోమయ్య డిమాండ్ చేశారు. అశోక్ నగర్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయం వద్ద డ్రైవర్లు ఆందోళన నిర్వహించిన అనంతరం డీసీఎల్ శ్రీనివాస్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా క్లాప్ డ్రైవర్లను తొలగించడం అన్యాయమన్నారు. డ్రైవర్లను వెంటనే విధుల్లోకి తీసుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. క్లాప్ ఆటోల నిలుపుదల వలన నగరంలో కూడా చెత్తసేకరణ సరిగాలేదని ఆరోపించారు. కార్యక్రమంలో రాజు, బి.శ్రీను, గణేష్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేపట్టిన క్లాప్ డ్రైవర్లు

విద్యార్థుల కోసం కూటమి ప్రభుత్వం విశేష కృషి

టీడీపీ మండలాధ్యక్షుడు నరేష్

కొయ్యలగూడెం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల భవిష్యత్ కోసం కూటమి ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని టీడీపీ మండల అధ్యక్షుడు పారేపల్లి నరేష్ అన్నారు. ఈ సందర్భంగా సోమవారం బయ్యన్నగూడెంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019లో అబద్దాలతో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం విద్యార్థులను అన్ని విధాలా మోసం చేసిందని విమర్శించారు. వైసీపీ చేపట్టే పోరుబాటను ఎవ్వరూ నమ్మరని అన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు శెట్టి అంజి, బాలు,చిట్టిబాబు, గంగాధరం, రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

రిటైర్డ్ అదనపు ఎస్పీ రత్నయ్య మృతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : రిటైర్డ్ అదనపు ఎస్పీ పొనుకు రత్నయ్య(85) అనారోగ్యంతో సోమవారం సాయంత్రం ఏలూరు విద్యా నగర్‌లో ఉన్న తన నివాసంలో మరణించారు. రత్నయ్య ఏలూరు నగరంలో వివిధ స్టేషన్లలో ఎస్ఐగా, సీఐగా పనిచేశారు. అప్పట్లో రత్నయ్య వస్తున్నారంటేనే రోడ్లపై కర్ఫ్యూ వాతావరణం కనిపించేది. నూజివీడు డీఎస్పీగా పనిచేసి అదనపు ఎస్పీగా నల్గొండలో పనిచేస్తూ 2000 సంవత్సరంలో పదవి విరమణ పొందారు. అనంతరం ఆయన న్యాయవాదిగా కూడా ఎన్‌రోల్ అయ్యారు. ఒక ప్రైవేటు కంపెనీకి న్యాయ సలహాదారుడిగా కూడా పనిచేశారు. ఏలూరు విద్యా నగర్ నివాసం ఉంటున్న ఆయన అనారోగ్యంతో సోమవారం సాయంత్రం మరణించారు. ఆయన భార్య టీచర్‌గా పనిచేసి పదవి విరమణ పొంది 2020లో మరణించారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు ఉండగా అందరికీ వివాహాలు అయ్యాయి.



రత్నయ్య(ఫైల్)

'ఇగ్నో' దూరవిద్య కోర్సుల అడ్మిషన్లకు నోటిఫికేషన్

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో)లో దూర విద్య కోర్సులు, ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాలకు సోమవారం నోటిఫికేషన్ జారీ అయిందని సీఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రామరాజు, యూనివర్సిటీ స్టడీసెంటర్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు తెలిపారు. సర్టిఫికెట్, డిప్లొమా, పీజీ డిప్లొమా, డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు స్టడీసెంటర్ ఫోన్‌నెంబరు 94903 50469లో సంప్రదించాలని కోరారు.

22 నుంచి గరికపాటి నాటకోత్సవాలు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : గరికపాటి ఆర్ట్ థియేటర్ 274 కార్యక్రమంలో భాగంగా ఈ నెల 22, 23 తేదీల్లో రెండు రోజుల పాటు ఏలూరు వైఎంహెచ్ఏ హాల్ ప్రాంగణంలో గరికపాటి నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్టు అధ్యక్షుడు గరికపాటి కాళిదాసు తెలిపారు. పలు నాటికలను ప్రదర్శించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి సినీ విజ్ఞాన విశారద ఎస్.వి.రామారావు, యువ కళావాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ, పలువురు ప్రముఖులు విచ్చేస్తారని తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటల నుంచి నాటిక పోటీలు ప్రారంభమవుతాయన్నారు. కళాభిమానులు పాల్గొని నాటక పోటీలను విజయవంతం చేయాలని కాళిదాసు విజ్ఞప్తి చేశారు.

నిరుపేదలకు ఇళ్లను కేటాయించండి : సీపీఐ

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : ఇళ్లు లేని నిరుపేదలకు మూడు సెంట్ల ఇళ్ల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు తక్షణమే మంజూరు చేయాలని కోరుతూ తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం తిమ్మాపురం, కోడిగూడెం, రామసింగవరం గ్రామస్థులు సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం డీటీ దుర్గామహాలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళనలో సీపీఐ మండల కార్యదర్శి జి.బాలేసు, పార్టీ నేతలు యడ్లపల్లి రమేష్, పెండ్లి భూషణం, కె.రామకృష్ణ, పాకనాటి సుబ్బారావు, ఉండి మార్తమ్మ, లక్ష్మి, సత్యవతి పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి

చింతలపూడి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : కేన్సర్ వ్యాధి గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని 104 వాహనం సిబ్బందితో సామాజిక కార్యకర్త థెరీసమ్మ అవగాహన కల్పించారు. స్థానిక విశ్వనాథ ఆశ్రమంలో జరిగిన ఈ కార్యక్రమంలో రోగులతో మాట్లాడుతూ కేన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించి వైద్యం అందిస్తే ఎలాంటి ప్రమాదం ఉండదని అన్నారు. సామాజిక కార్యకర్త థెరీసమ్మ గతంలోను పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సదస్సులో ఆరోగ్య సిబ్బంది ఎం.లావణ్య, కె.కుమారి, బి.ఝాన్సీ లక్ష్మి, ఆశ వర్కర్లు అన్నమ్మ, రత్నకుమారి, లక్ష్మీప్రియ, సరళ కుమారి, అశ్విని, దివ్య పేషంట్ల అనుమానాలను నివృత్తి చేశారు.

ఇంటర్ క్వాలిఫైయింగ్ పరీక్షకు 551 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : ఇంటర్ క్వాలిఫైయింగ్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన పర్యావరణ విద్య పరీక్షకు జిల్లాలో జనరల్ విభాగంలో 15,991 మంది విద్యార్థులకు 15,605 మంది, ఒకేషనల్ విభాగంలో 2452 మందికి 2287మంది హాజరయ్యారని ఆర్ఐవో చంద్రశేఖర్ బాబు తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు.

కరాటే పోటీల్లో షహిత్‌కు బంగారు పతకం

ఏలూరు రూరల్, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): యునైటెడ్ షోటో కాన్ కరాటే దూ ఇండియా ఆధ్వర్యంలో విశాఖపట్నంలో కరాటే పోటీలు ఉత్సాహంగా జరిగాయి. 8వ ఆల్‌స్టైల్స్ ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీల్లో ఏలూరు జిల్లాకు చెందిన మోటేపల్లి షహిత్ అత్యంత ప్రతిభను కనబర్చి బంగారు పతకం సాధించాడు.



కేంద్ర బడ్జెట్‌లో ఆదివాసీలకు అన్యాయం

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆదివాసీలకు తీరని అన్యాయం జరిగిందని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తెల్లం రామకృష్ణ, ధర్ముల రమేష్ అన్నారు. సోమవారం నాయకులు మాట్లాడుతూ వికసిత్ భారత్ అంటూ ప్రచారాన్ని ఊదరగొట్టిన బీజేపీ ప్రభుత్వం గిరిజనులను మరింతగా పేదరికంలో నెట్టే విధంగా కేటాయింపులు ఉన్నాయన్నారు. గిరిజన ఉన్నత విద్యకు కేవలం 2కోట్లు మాత్రమే కేటాయించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ప్రి మెట్రిక్ స్కాలర్ షిప్ 313 కోట్లు మాత్రమే ఇచ్చారని తెలిపారు. పెరుగుతున్న గిరిజన జనాభాకు అనుగుణంగా బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం జరగలేదని, విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో కోతలు విధించడం దుర్మార్గమన్నారు. ఆదివాసీ ప్రజాప్రతినిధులు పార్లమెంటులో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిధులు పెరుగుదలకు కృషి చేయాలని కోరారు.

ఇంటర్వ్యూ..

డ్రైనేజీల్లో చెత్తను వేసి మురుగును బ్లాక్ చేయకండి

జె.ఎం.రత్నకుమార్, మండల విస్తరణాధికారి, లింగపాలెం



- **మండలంలోని అన్ని పంచాయతీలకు కార్యదర్శులు ఉన్నారా?**

జవాబు : మండలంలో 22 గ్రామాలకు పంచాయితీ కార్యదర్శులు అందుబాటులో ఉన్నారు.

- **వేసవిలో తాగునీటి ఎద్దడిని ఎలా ఎదుర్కొంటారు?**

జవాబు : ప్రస్తుతం తాగునీటికి ఇబ్బంది లేదు. మండలంలో ఎక్కడైనా ఇబ్బంది వస్తే ట్యాంకర్ల ద్వారా నీరు అందుబాటులో ఉంచుతాం.

- **పరిశుభ్రతపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**

జవాబు : గ్రామాల్లో 15 రోజులకు ఒకసారి శానిటేషన్ నిర్వహిస్తున్నాం. క్లాప్ మిత్రల ద్వారా చెత్తను సేకరించి సంపద సృష్టి కేంద్రాలకు తరలిస్తున్నాం. గ్రామాలను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటున్నాం.

- **డ్రైనేజీల నిర్వహణకు చర్యలు చేపట్టారా?**

జవాబు: కొన్నిచోట్ల ఇబ్బందులు ఉన్నాయి. ఇళ్లలోని చెత్త డ్రైనేజీల్లో వేయడంతో బ్లాక్ అయ్యి మురుగు రోడ్లపైకి వస్తోంది. చెత్తను డ్రైనేజీల్లో వేయకుండా చెత్తను శానిటరీ సిబ్బందికి ఇవ్వాలి.

- **మండలంలో వర్మీ కంపోస్టు కేంద్రాలున్నాయా?**

జవాబు : మండలంలో 20 వర్మీ కంపోస్టు కేంద్రాలున్నాయి. మరో రెండు నిర్మాణ దశలో ఉన్నాయి. ప్రస్తుతం మండలంలో వర్మీ కంపోస్టు అందుబాటులో ఉంది. రైతులతో మాట్లాడి వారికి ఎరువును అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

- **మండలాభివృద్ధికి మీ చర్యలేమిటి?**

జవాబు : మండలంలో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నాం. గ్రామాల్లో శానిటేషన్, తాగునీరు, సీసీ రోడ్లు, వీధిదీపాలతో పాటు ప్రజలకు అనేక మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.

- లింగపాలెం

50 లీటర్ల సారా స్వాధీనం

కొయ్యలగూడెం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): 50లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం మండలంలోని కుంతలగూడెం వద్ద మోటార్ సైకిల్‌పై కడలి శ్రీను అనే వ్యక్తి సారా తరలిస్తున్నాడు. తమకు సమాచారం రావడంతో సిబ్బంది, మధ్యవర్తులతో వెళ్లిదాడి చేసి పట్టుకున్నట్టు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు ఎస్సై తెలిపారు.

మద్యం సీసాల స్వాధీనం...

కుక్కునూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఇబ్రహీం పేట, రాజీవ్ నగర్ ప్రాంతాల్లో 26 మద్యం సీసాలతో ఉన్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. అక్రమ మద్యం, సారా తయారీపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్సై జీ.వెంకట లక్ష్మి, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణల పరిశీలన

పెదపాడు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : పెదపాడు మండలం తాళ్ళగూడెంలో స్థానిక సమస్యలను ఎంపీడీవో అమీలు జమతో కలిసి సోమవారం పరిశీలించినట్టు తహసీల్దారు కృష్ణజ్యోతి తెలిపారు. ఇటీవల తాళ్ళగూడెం గ్రామంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి పర్యటించి, స్థానికంగా గుర్తించిన సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అందులో భాగంగా మంచినీటి చెరువును పరిశీలించి, చెరువు చుట్టూ కొన్ని ఆక్రమణలను గుర్తించి, వారితో మాట్లాడినట్టు తహసీల్దారు చెప్పారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఒకరికి గాయాలు

ఉంగుటూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై కైకరం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఎదురెదురుగా రెండు మోటార్ సైకిళ్ళు ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో కైకరం గ్రామానికి చెందిన డొక్కా శ్రీను అనే వ్యక్తికి గాయాలవడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

చికెన్ వ్యర్థాల పట్టివేత

పెదపాడు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా తనిఖీ నిర్వహించి ఐషర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లుగా పెదపాడు పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సువర్ణరాజు తెలిపారు. వాహనంలోని సుమారు 10 వేల కిలోల చికెన్ వ్యర్థాలను గొయ్యి తీసి పూడ్చి పెట్టించినట్లు చెప్పారు. వాహన యజమాని, డ్రైవర్లపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పశువుల వ్యాన్ పట్టివేత

ఏలూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం బైపాస్‌లోని కాకర్ల జంక్షన్ వద్ద మూడు డీసీఎం వాహనాల్లో ఆవులను తరలిస్తుండగా ఎస్సై ఎస్.కె.జబీర్ తన సిబ్బందితో వాహనాలను ఆపి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జంగారెడ్డి గూడెంలోని పోలవరం కాలనీకి చెందిన కోలా సాయి అనే యువకుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆపివేశారు. 34 ఆవులు, రెండు పాడె గేదెలు కొనుగోలు చేసుకుని మూడు వాహనాల్లో తెలంగాణలోని జనగాం జిల్లా లింగాల గణపవరం మండలం కుందారం గ్రామానికి తీసుకువెళ్తున్నట్టు సంబంధిత వ్యక్తులు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహం తొలగింపుపై చర్యలు తీసుకోవాలి

ముదినేపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లిలో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తొలగించిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటులో జాప్యంపై విగ్రహ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు నిమ్మగడ్డ బిక్షాలు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. గత ఏడాది అక్టోబర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మాణ కమిటీకి సమాచారం లేకుండా ఎన్‌హెచ్ అధికారులు, కాంట్రాక్టరు తొలగించి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉంచారు. అప్పట్లో ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని సోమవారం ఎస్పీకి పోస్టులో ఫిర్యాదు పంపినట్లు బిక్షాలు తెలిపారు.

సజావుగా సార్వా ధాన్యం కొనుగోళ్లు

ముదినేపల్లి మండలంలో 28 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యం

ముదినేపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల సంస్థ ద్వారా చేపట్టిన సార్వా ధాన్యం కొనుగోళ్లు ముదినేపల్లి మండలంలో తుదిదశకు చేరుకున్నాయి. మండలంలో 17 వేల ఎకరాల విస్తీర్ణంలో ఈ ఏడాది సార్వా వరి సాగు చేయగా, 41 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లకు పౌరసరఫరాల సంస్థ లక్ష్యంగా నిర్ణయించింది. తుపాన్‌ల ఫలితంగా ధాన్యం దిగుబడి తగ్గగా సుమారు 34 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసే అవకాశం ఏర్పడింది. ఇప్పటి వరకు సుమారు 28 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా 4,200 మంది రైతులకు రూ.62 కోట్ల సొమ్ము రైతుల బ్యాంక్ ఖాతాలకు జమ అయింది. ఇంకా మండలంలో వరి కుప్పల నూర్పిళ్లు పూర్తయితే సుమారు ఐదు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరుగుతాయి.

ప్రభుత్వ విధానం బాగుంది..



ధాన్యం కొనుగోళ్లలో కూటమి ప్రభుత్వం అనుసరించిన విధానం బాగుంది. నిబంధనలు సడలించి కొనుగోళ్లు నిర్వహించడంతో ఇబ్బందులు కలుగలేదు. ధాన్యం అమ్మిన సొమ్ము 24 గంటల సమయంలోపే బ్యాంక్ ఖాతాల్లో జమ అయింది.

- మట్లపూడి మదన్, రైతు, కొత్తపల్లి

రైతులు సహకరించారు..



ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిబంధనలు సడలించడం వల్ల రైతులు ఇబ్బందులు పడలేదు. రైతులతో ఎటువంటి వివాదాలు రాలేదు. ఇప్పటి వరకు 28 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం.

- విజయ్ కుమార్, డీసీఎంఎస్ మండల ఇన్‌చార్జ్

చిన్నారులను హింసించిన

నిందితుడి అరెస్ట్

- జంగారెడ్డిగూడెం ఘటనలో హత్యాయత్నం కేసు నమోదు
- తల్లిపై కూడా కేసు
- బాలల హక్కుల కమిషన్ సభ్యుడి ఆరా



నిందితుడి వివరాలు తెలియజేస్తున్న పోలీసులు

ఏలూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణంలో ఇద్దరు చిన్నారులను పైశాచికంగా హింసించి తీవ్రంగా గాయపరచిన నల్లవెలుగుల పవన్ కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. చిత్రహింసను అడ్డుకోని చిన్న పిల్లల తల్లిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. పట్టణంలోని సీఐ కార్యాలయం వద్ద సోమ వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రవిచంద్ర వివరాలు తెలిపారు. నింది తుడు పవన్ కుమార్, అతడితో సహజీవనం చేస్తున్న శారద ఏకాంతానికి అడ్డుగా ఉన్న పిల్లలను ఘోరంగా హింసించేవాడన్నారు. ఈ నెల 1న రాత్రి బాలుడు రాహుల్‌ను పవన్ వైర్ తో బలంగా కొట్టడంతో భయపడి ఇంటి నుంచి బయటకు పారిపోతూ స్థానికుల సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. ఘటన తరువాత పవన్ పరారు కావడంతో ఎస్సై జబీర్ స్థానికుల సహకారంతో సోమవారం అరెస్ట్ చేశామన్నారు. పిల్లలను విచక్షణారహితంగా కొట్టిన నిందితుడు పవన్ పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరు పరుస్తామన్నారు. పిల్లలను కొట్టిన సంఘటనలో వారి తల్లి శారదపై కూడా కేసు నమోదు చేశా మని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ విక్ర ష్ణబాబు, ఎస్సై ఎస్‌కె.జబీర్ సిబ్బంది ఉన్నారు.

కఠిన చర్యలు తప్పవు...

బాలల హక్కులకు భంగం కలిగించి వారిపై దాడులకు పాల్పడిన వారిపై జువైనల్ చట్టం కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు జె.రాజేంద్రప్రసాద్ అన్నారు. నిందితులకు రూ.లక్ష జరిమానా, మూడేళ్ల జైలు శిక్ష విధించబడుతుందని తెలిపారు. ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాహుల్, రేణుకను సోమవారం ఆయన పరామర్శించారు. ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూలాను సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పసిబిడ్డ నుండి 18 ఏళ్లలోపు బాలలను శారీరకంగా, లైంగికంగా వేధించిన వారిపై జువైనల్ చట్టం కఠిన శిక్షలు పడతాయని హెచ్చరించారు. రాహుల్, రేణుకను హింసించిన పవన్‌పై జువై నల్ జస్టిస్ సెక్షన్ 75 ప్రకారం కేసు నమోదు చేయాలని ఎస్సై జబీర్‌కు సూచించారు. కఠిన చట్టాలు అమలైతేనే ఇటువంటి ఘటనలు నిరో ధించవచ్చన్నారు. ఆయనతో పాటు ఎంఈవో రాములు, కౌన్సిలర్లు రమాదేవి, జ్యోతి, టీడీపీ నాయకురాలు పగడం సౌభాగ్యవతి, తదితరులు పాల్గొన్నారు.

భార్య మోసగించడంతో.. భర్త ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నువ్వంటే ఇష్టం అంటూ దగ్గరైంది. పెళ్లి చేసుకుంది. ఒక బిడ్డకు జన్మనిచ్చింది. తర్వాత మరో యువకుడిపై మోజుపడింది. ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్తను కాదని ప్రియుడి వద్దకు వెళ్లిపోవడంతో తట్టుకోలేని భర్త ఆమె చున్నీతోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు నగరంలో ఈ సంఘటన సోమవారం జరిగింది. తంగెళ్లమూడి ప్రాంతం పుష్పలీలా నగర్ కు చెందిన బోను సాయిదుర్గారావు (28) తాపీ పనులు చేస్తాడు. ఒక యువతి పరిచయం కావడంతో ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వారికి ఒక పాప ఉంది. మరో యువకునితో ఆమె వివాహేతర సంబంధం కొనసాగించడంతో దుర్గారావు మందలించాడు. అతనే ఇష్టమంటూ దుర్గారావును విడిచిపెట్టి వెళ్లిపోయింది. భార్య మోసగించిందని జీవితంపై చెంది సోమవారం దుర్గారావు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అతడి భార్యపై టూటౌన్ సీఐ వైవి రమణ ఆధ్వర్యంలో ఎస్ఐ ఆర్ నాగ కల్యాణి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం

ఆర్టీసీ బస్‌స్టేషన్ భవనానికి బీటలు

ముదినేపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భవనాల నిర్వహణలో పర్యవేక్షణ కొరవడడంతో లక్షలాది రూపాయల విలువైన ఆస్తులు నిరుపయోగంగా మారిపోతున్నాయి. స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్ కాంప్లెక్స్ భవనంపై కొంతకాలంగా చిన్న మొక్క పెరగడంతో బీటలు వారుతోంది. ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో మొక్క పెరిగి పెద్దది అవుతోంది. భవనం బీటలు వారుతున్నా చిన్న మొక్కను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పర్యావరణాన్ని, పక్షులను కాపాడుకోవాలి

ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఫారెస్ట్ అధికారి చిరంజీవి చౌదరి



ఆటపాక పక్షుల కేంద్రంలో వలసపక్షులు, చిత్తడినేలల పరిరక్షణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి, తదితరులు

కైకలూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని, పక్షులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఫారెస్ట్ అధికారి (పీసీసీఎఫ్) చిరంజీవి చౌదరి అన్నారు. ఆటపాక పక్షుల కేంద్రంలో అటవీశాఖ, వరల్డ్ వైల్డ్ ఫండ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం చిత్తడి నేలల దినోత్సవాన్ని నిర్వహించారు. 38 పాఠశాలల నుంచి 900 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మట్టితో పక్షుల నమూనా విశేషంగా ఆకట్టుకుంది. అటవీశాఖ అధికారులు నిర్వహించిన పోటీల్లో మట్టితో అప్పటికప్పుడు జీవవైవిధ్యం ఉట్టిపడేలా పక్షుల నమూనా తయారుచేసి అబ్బురపరిచారు. వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. కొల్లేరు చిత్తడినేలల ప్రాముఖ్యత తెలియజేస్తూ ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శనతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో చిరంజీవి చౌదరి మాట్లాడుతూ దేశంలో ప్రతీ పౌరుడు పర్యావరణాన్ని కాపాడేందుకు ముందుకు రావాల న్నారు. ఆటపాక, కైకలూరు గ్రామాల ప్రజలు ఇళ్ల వద్దే పర్యాటకులకు అనువుగా ఉండేలా కాటేజీలను ఏర్పాటు చేయాలన్నారు. చిత్తడి నేలలు పుష్కలంగా ఉంటే భూగర్భ జలాలు సమృద్ధిగా ఉంటాయన్నారు. వలస పక్షులు - చిత్తడి నేలల సంరక్షణ పోస్టర్లను ఆవిష్కరించారు. వైల్డ్‌లైఫ్ వార్డెన్ అజయ్‌కుమార్ నాయక్, చీఫ్ కన్జర్వేటర్ ఫారెస్ట్ అధికారి బీఎన్ఎన్ మూర్తి, జిల్లా అటవీశాఖాధికారి శుభం, డీఎఫ్‌వో బి.విజయ, డబ్ల్యూ డబ్ల్యూఎఫ్ కోఆర్డినేటర్ ఫరిదా టెంపుల్, కైకలూరు, ఏలూరు రేంజర్లు రామలింగాచార్యులు, మోహిని విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



మట్టితో తయారుచేసిన పక్షుల నమూనాలను చూపుతున్న విద్యార్థినులు



పెదగొన్నూరులో క్రీడాకారులకు క్రికెట్ కిట్లు అందజేస్తున్న సినీ నిర్మాత కేవెల్ నారాయణ

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

సినీ నిర్మాత కేవెల్ నారాయణ

ముదినేపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని దుర్గా ఆర్ట్స్ అధినేత, సినీ నిర్మాత డాక్టర్ కేవెల్ నారాయణ అన్నారు. ఆయన స్వగ్రామం పెదగొన్నూరులోని క్రీడాకారులకు సోమవారం ఆయన క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదం చేస్తాయని, యువకులు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. క్రీడాకారులకు తనవంతు ప్రోత్సాహం ఉంటుందన్నారు. క్రీడల ద్వారా యువకులకు ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యత ఉంటుందని, విద్యార్థి దశ నుంచి చదువులతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. పలువురు ఎన్డీఏ నాయకులు పాల్గొన్నారు.

రామలక్ష్మికి ఘన నివాళులు

ముదినేపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పెదగొన్నూరులో ఇటీవల మృతిచెందిన టీడీపీ నాయకురాలు మండవ రామలక్ష్మి చిత్రపటం వద్ద పలువురు నాయకులు నివాళులర్పించారు. సోమవారం జరిగిన సంస్మరణ కార్యక్రమంలో సినీ నిర్మాత కేవెల్ నారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగొళ్ల శోభనాద్రి చౌదరి, తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి చెలసాని జగన్మోహనరావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తూరి విఠల్ రామలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఆమె కుటుంబ సభ్యులను పరా మర్శించారు.

వైస్ చైర్మన్ పదవి పగడాలకు ఎలా ఇస్తారు?

నిరసన తెలిపిన తెలుగు మహిళ

నూజివీడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక కార్యక్రమం అటు కౌన్సిల్ హాల్లోనూ, ఇటు మున్సిపల్ ఆఫీస్ బయట తీవ్ర రాజకీయవేడిని రాజేసింది. ఓ వైపు కౌన్సిల్‌హాల్లో వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తుండగా, మున్సిపల్ కార్యాలయం బయట నిన్న, మొన్నటి వరకు వైసీపీలో ఉండి, తెలుగుదేశం పార్టీలో చేరిన పగడాలకు తిరిగి వైస్ చైర్మన్ ఎలా ఇస్తారంటూ తెలుగు మహిళ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ సతీమణి చెరుకూరి లక్ష్మి నిరసన తెలియజేశారు. దీంతో కొద్దిసేపు మున్సిపల్ కార్యాలయం వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. చివరికి తెలుగుదేశం పార్టీ నాయకులు కల్పించుకుని ఆమెను సుముదాయించారు. కౌన్సిల్లో వైస్‌చైర్మన్ ఎన్నికల్లో కీలకంగా వ్యవహరిస్తున్న మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ దుర్గాప్రసాద్ విషయం తెలుసుకుని, బయటకు వచ్చి భార్యను తీసుకుని ఇంటికి వెళ్లిపోయారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి చెరుకూరి దుర్గాప్రసాద్ ఇంటికి వెళ్లి ఆమెకు పార్టీ నిర్ణయాన్ని వివరించి చెప్పి నచ్చచెప్పినట్లు తెలిసింది.

వైసీపీ కౌన్సిలర్లకు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ సన్మానం

నూజివీడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు మున్సిపాల్టీ ఏర్పడిన నాటి నుంచి అది తనతోనే ఉందని, మున్సిపాల్టీలో ఎప్పుడు తెలుగు దేశం పార్టీ బలం ఏడు కౌన్సిలర్ల పదవులకు మించలేదని వచ్చే ఎన్నికల్లో తిరిగి ఏడు స్థానాలకే పరిమితం చేస్తామని నూజివీడు మాజీ శాసనసభ్యులు, వైసీపీ నాయకుడు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడులోని తన కార్యాలయంలో సోమవారం వైసీపీ తరపున పోటీకి నిలిపిన వైస్ చైర్మన్ అభ్యర్థి నవుడు నాగమల్లేశ్వరరావుకు మద్దతు తెలిపిన వైసీపీ కౌన్సిలర్లను ఆయన సత్కరించారు. గతంలో 30 స్థానాలు ఉండగా, ఏడు స్థానాలు మాత్రమే తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు గెలిచేవారని, కౌన్సిల్ సభ్యుల సంఖ్య 32కు పెరిగినా ఆ పార్టీ సభ్యుల సంఖ్యమాత్రం పెరగలేదన్నారు. నూజివీడు పురపాలక సంఘం ఎప్పుడూ తనదేనని కౌన్సిలర్లను ప్రలోభ పెట్టి పార్టీ మార్చేలా చేసినా వచ్చే ఎన్నికల్లోనూ మున్సిపాల్టీపై తన ముద్ర వేస్తానన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలుకు చర్యలు

చాట్రాయి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండలంలో ప్రవర్తనా నియమావళి అమలపై అధికారులు చర్యలు చేపట్టారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయడం, వివిధ రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల తొలగింపు పనులు ముమ్మరం చేశారు. మంగళవారం సాయంత్రానికి ఈ పనులు పూర్తి చేస్తామని అధికారులు చెప్పారు. మండల కోడ్ ఆఫ్ కండక్ట్ టీం అధికారిగా ఎంపీడీవో విజయలక్ష్మి, సహాయకుడిగా సీనియర్ అసిస్టెంట్ సీతారామారావు, స్పెషల్ వీడియో టీం అధికారిగా ఎంఈవో బ్రహ్మచారి, సహాయకురాలిగా జూనియర్ అసిస్టెంట్ నవ్య, వీడియోగ్రాఫర్‌గా పి.షణ్ముఖను నియమిస్తూ కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలు జారీ చేశారు.

పెదశేష వాహనంపై శోభనాచలుడు



ప్రత్యేక అలంకరణలో స్వామి

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపలి శోభనాచల వ్యాఘ్రలక్ష్మి నరసింహస్వామి రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా 5వ రోజు అయిన సోమవారం పెదశేష వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనం ఇచ్చారు. సోమవారం ఉదయం శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. రాత్రిస్వామిని పెండ్లి కుమారుడిగా అలంకరించి పెద్దశేష వాహనంపై గ్రామో త్సవం నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపం వద్దకు తీసుకువచ్చి నిత్యకల్యాణం, కాపు సంఘం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వేదాంతం శేషబాబు, అనంతకృష్ణ వేదపండితుల ఆధ్వర్యంలో కల్యాణం వైభవంగా నిర్వహించారు.



పీఆర్టీయూ స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా రామోజీ

కైకలూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా విశ్వనాథుని రామోజీ, దండు హరిబాబును ఎన్నుకున్నారు. కలిదిండి, మండవల్లి, కైకలూరు మండలాలల డెమోక్రటిక్ పీఆర్టీయూ ప్రాంతీయ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆజాద్ సమక్షంలో మండల కమిటీ నియమించారు. పదో తరగతి స్టడీ మెటీరియల్ అందజేశారు. పీఆర్టీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీవీఎస్ రామాంజనేయులు, జిల్లా కార్యదర్శులు జి.సముద్రుడు, టి.బలరాం, టీవీ.సుబ్రహ్మణ్యం, డి.జయరాం తదితరులు పాల్గొన్నారు.

పాత బాకీ నేపథ్యంలో కొట్లాట

ముదినేపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పాత బాకీ విషయమై ఇద్దరి మధ్య వివాదం ఘర్షణకు దారితీసింది. వడాలిలో సోమవారం అనగాని శ్రీనివాస్, కాగిత నాగబాబు జగన్నాథస్వామి దేవస్థానం వద్ద ఉండగా అక్కడికి జన్ను జయసాయి వచ్చాడు. శ్రీనివాస్ తనకు ఇవ్వాల్సిన డబ్బుల బాకీ విషయమై జయసాయిని అడగ్గా, ఇద్దరి మధ్య వివాదం తలెత్తింది. బకాయిదారు సాయి కర్రతో శ్రీనివాస్‌ను కొట్టి గాయపర్చారు. కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


ముదినేపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా వాడవల్లి యూపీ పాఠశాల విద్యార్థులకు దేవపూడి పీహెచ్‌సీ డాక్టర్ వినయ్ ఆధ్వర్యంలో హెల్త్ సూపర్‌వైజర్ భార్గవి, ఏఎన్ఎం విజయ కుమారి సోమవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పతకాలతో విద్యార్థులు

అంధ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తోటపల్లిలోని హీల్ అంధ పాఠశాల విద్యార్థులు ఆదివారం మంగళగిరి పోలీస్‌పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 7వ పారా అథ్లెటిక్స్‌లో పలు పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ బి.సాయిబాబు తెలిపారు. లీలామాధురి వంద మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం, నాలుగు వందల మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం సాధించగా, బాలికల విభాగంలో జె.వరలక్ష్మి పదిహేను వందల మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం, డిస్క్‌త్రోలో ద్వితీయ స్థానం సాధించారు. జూనియర్ బాలుర విభాగం వంద, 200 మీటర్ల పరుగు పందెంలో సిహెచ్ హరి, ఆర్.మోక్షజ్ఞలు ద్వితీయ స్థానంతో పాటు లాంగ్‌జంప్‌లో ప్రథమ, తృతీయ స్థానాలు సాధించగా, జి.మధు, ఆకాష్‌గంగ్‌లు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. సీనియర్ బాలుర విభాగంలో హెచ్ఎల్ రోహిత్, ప్రవీణ్, కె.సునీల్ పదిహేను వందల మీటర్ల పరుగు పందెం, జావెలిన్‌త్రో, లాంగ్ జంప్ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని తెలిపారు.



ముసునూరులోని దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

ముసునూరు/ఆగిరిపల్లి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): దుకాణాల యాజమానులు ఎరువుల అమ్మకాల్లో తప్పసరిగా నిబంధనలు పాటించాలని తనిఖీ అధికారి పి.జి.బుజ్జిబాబు అన్నారు. సోమవారం ముసునూరులో ఉన్న ఎరువుల షాపును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్‌ను పరిశీలించి, ఎరువు బస్తా బరువును, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం వ్యవసాయ కార్యాలయంలో ఎరువుల డీలర్లతో జరిగిన సమావేశంలో బుజ్జిబాబు మాట్లాడుతూ ఎరువుల అమ్మకాలను ఈ పాస్ ద్వారానే చేయాలని, ఎరువుల స్టాక్ నిల్వల సమాచారాన్ని బోర్డులపై రైతులకు కనిపించేలా ఉంచాలని సూచించారు. ఏవో కె.సీహెచ్ సూరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు. ఆగిరిపల్లి మండలంలో ఎరువుల దుకాణాలను కోట తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పలగాని చెన్నారావు, సిబ్బంది పాల్గొన్నారు.

45 లీటర్ల సారా స్వాధీనం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : నూజివీడు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఒకరిని అరెస్టు చేసి 45 లీటర్ల సారా, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ అజయ్ కుమార్ సింగ్ తెలిపారు. నూజివీడు మండలం మిట్టగూడెం గ్రామంలో ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం అన్నేరావుపేట గ్రామానికి చెందిన బూక్యా కసుమను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.



సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులు

సామూహిక అక్షరాభ్యాసం

కలిదిండి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమి పురస్కరించుకుని గుర్వాయిపాలెం సరస్వతీదేవి ఆలయంలో సోమవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. అర్చకుడు సాయిచంద్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. రిటైర్డ్ డీఎస్పీ మురళి, ఎంపీటీసీ గోదావరి సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు రాట ప్రతిష్ఠ

కలిదిండి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి పురస్కరించుకుని పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాల ఏర్పాట్లకు సోమవారం అర్చకుడు అయిలూరి మల్లిబాబు పందిరి రాట ప్రతిష్ఠించారు. భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఈ నెల 24 నుంచి 28 వరకు నిర్వహిస్తామని ఈవో శేఖర్ తెలిపారు.

నేడు జాతరపై సమన్వయ సమావేశం

కైకలూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తామని ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాసు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో అచ్యుత అంబరీష్ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. సంబంధిత శాఖల అధికారులంతా సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

క్లస్టర్ పాఠశాలలుగా ఐదు జడ్పీ హైస్కూళ్ల ఎంపిక

ముదినేపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో క్లస్టర్ పాఠశాలలుగా ఐదు జడ్పీ హైస్కూళ్లను ఎంపికచేస్తూ ఎంఈవో వెంకట లక్ష్మమ్మ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ముదినేపల్లి, బొమ్మినంపాడు, అల్లూరు, పెదగొన్నూరు, పెదపాలపర్రు పాఠశాలలను క్లస్టర్ పాఠశాలలుగా ఏర్పాటు చేశారు. ఒక్కో క్లస్టర్ పాఠశాల పరిధిలో అందుబాటులో ఉండే 12 నుంచి 15 పాఠశాలలను చేర్చుతారు. మండలంలో 54 మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలు ఉన్నాయి. క్లస్టర్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహిస్తారు.

ఆర్జేడీ కార్యాలయ అటాచ్‌మెంట్‌లోనే..

ముదినేపల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్

ముదినేపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జాస్మిన్ ఇంటర్మీడియట్ ఆర్జేడీ కార్యాలయ అటాచ్‌మెంట్‌లో కొనసాగుతున్నారు. గత నెల 4న కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం రోజున పరిణామాలు, ప్రిన్సిపాల్ చాలా ఆలస్యంగా రావడంపై అధికారులకు ఫిర్యాదులు అందాయి. సమాచారం సేకరించిన ఆర్జేడీ ప్రాథమిక చర్యగా ప్రిన్సిపాల్‌ను రాజమండ్రి ఆర్జేడీ కార్యాలయానికి అటాచ్‌చేస్తూ అప్పట్లో ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా లెక్చరర్ ఓ.సత్యనారాయణమూర్తిని నియమించారు. అనంతరం కృష్ణా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి సాల్మన్‌రాజుతో పూర్తి స్థాయి విచారణ జరిపించారు. విచారణ నివేదికను సాల్మన్‌రాజు శనివారం ఆర్జేడీకి అందజేశారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ జాస్మిన్‌ను ఆర్జేడీ కార్యాలయ అటాచ్ మెంట్‌ను కొనసాగిస్తున్నారు. అయితే కొన్ని సాంకేతిక కారణాల వల్ల ప్రిన్సిపాల్ డ్రాయింగ్ ఆఫీసర్‌గా కొనసాగుతుండగా కళాశాల పర్యవేక్షణ, పరిపాలన బాధ్యతలను ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మూర్తికి అప్పగించారు.

ఆంజనేయ స్వామి గుడి స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

ముసునూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రమణక్కపేట ఉప్పేవారి బజారులో ఉన్న ఆంజనేయస్వామి గుడి ఆక్రమణకు గురైంది. వైసీపీ సానుభూతిపరులు గుడి ఉన్న భూమి సైతం తమదేనంటూ చుట్టూ ఫెన్సింగ్ వేయడంతో సోమవారం టీడీపీ నాయకుడు ఉప్పే శివనాగాంజనేయులు (బాబి) తదితరులు నూజివీడు సబ్ కలెక్టర్‌తో పాటు మండల అధికారులకు ఫిర్యాదు చేశారు. బాబి మాట్లాడుతూ ఈ గుడి సుమారు 100 ఏళ్ల నుంచి ఉందని, శిథిలావస్థకు చేసిన గుడిని తన సొంత నగదుతో బాగుచేశామన్నారు. అయితే ఇటీవల గుడి ప్రాంగణంలో మట్టితోలుతుండగా ఉప్పే రాంబాబు అడ్డుకుని, సదరు గుడి స్థలం 5 సెంట్లు చుట్టూ ఫెన్సింగ్ వేసి, ఎదురుగా పెంటకుప్ప వేస్తున్నాడని తెలిపారు. రాంబాబుతో పాటు ఉప్పే వంశీ, సురేష్‌లు గుడి స్థలాన్ని కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నారన్నారు. అధికారులు దీనిపై సమగ్ర విచారణ చేయాలని కోరుతున్నారు.